

## నయా మాల్స్.. రియాల్టీ కమాల్

07


# విశాల భారతి

1-11-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 11




తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ఎదిగిన అతికొద్ది మంది మాస్ లీడర్లలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఒకరు. విద్యార్థి నాయకుడిగా కెరీర్ ప్రారంభించి, నేడు రాష్ట్ర రహదారులు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన ప్రయాణం ఎప్పుడూ సంచలనమే. మొండితనం, ముక్కుసూటితనానికి మారుపేరుగా నిలిచే కోమటిరెడ్డి, రాజకీయాల్లో ఎన్నో ఆరోపణలను, కుట్రలను ఎదుర్కొంటూనే ప్రజాబలంతో ముందుకు సాగుతున్నారు. అయితే ఇటీవల ఆయన వ్యక్తిగత జీవితాన్ని, మహిళా అధికారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వస్తున్న కొన్ని కథనాలపై ఆయన తీవ్ర ఆవేదనకు లోనయ్యారు.

# ప్రజల మనిషిపై పగ



- బలమైన నేతగా ఎదిగిన ఆయన ప్రయాణంలో అనేక ఒడిదుడుకులు
- రాజకీయంగా దెబ్బతీయడానికి అనేక కుట్రలు జరిగాయనే ఆరోపణ
- తెలంగాణ సాధన కోసం మంత్రి పదవినే వదిలేసిన చరిత్ర వెంకటరెడ్డిది
- సినిమా పరిశ్రమతో కూడా ఆయనకున్న అనుబంధం ప్రత్యేకమైనది
- సామాన్య ప్రేక్షకులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుకుంటారు
- తన ఇమేజ్‌ను డ్యామేజ్ చేసే పెద్ద కుట్ర జరుగుతుందని చెబుతున్నారు

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రస్థానం ఎప్పుడూ ఒక సంచలనమే**

03

## పట్టణాలను నాశనం చేశారు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం
- కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు
- పట్టణాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయన్నారు
- పట్టణ ప్రగతిని కాంగ్రెస్ పక్కన పెట్టిందన్నారు
- ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని వెల్లడి
- మున్సిపల్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారు

03





## పల్లెకు పోదాం

- తెలుగు వారికి పెద్ద పండగ సంక్రాంతి
- ఈ పండుగకి ప్రతి ఒక్కరు ఊరెళ్తారు
- దీంతో ఎటు చూసినా జన సందోహమే కనిపిస్తోంది
- మహానగరాలు దాదాపు ఖాళీ అవుతున్నాయి
- పల్లెలు పండగ వెలుగులతో నిండిపోతున్నాయి
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రోడ్లు జామ్ అయ్యాయి
- ఆర్టీసీ బస్సులు, ట్రైన్లు కిటకిటలాడుతున్నాయి

02

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి మామూలుగా లేదు. ఊరు వెళ్లాలనే ఆరాటం ప్రతి గుండెలోనూ కనిపిస్తోంది. బతుకుదెరువు కోసం సిటీల్లో స్థిరపడిన వారంతా తమ మూలాలను వెతుక్కుంటూ పల్లెబాట పట్టారు. అందుకే ఇప్పుడు ఎటు చూసినా జన సందోహమే కనిపిస్తోంది. హైదరాబాద్, బెంగళూరు వంటి మహానగరాలు దాదాపు ఖాళీ అవుతుంటే, పల్లెలు మాత్రం పండగ వెలుగులతో నిండిపోవడానికి సిద్ధమవుతున్నాయి. ఈ ప్రయాణాల రద్దీ చూస్తుంటే సంక్రాంతి అంటే కేవలం పండగ మాత్రమే కాదు, అదొక భావోద్వేగ ప్రయాణం అని అర్థమవుతోంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల ప్రధాన రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ముఖ్యంగా జాతీయ రహదారులపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అవుతోంది. టోల్ ప్లాజాల వద్ద పరిస్థితి చూస్తుంటే చుక్కలు కనిపిస్తున్నాయి. ఫాస్టాగ్ ఉన్నప్పటికీ, వాహనాల సంఖ్య విపరీతంగా ఉండటంతో ఒక్కో టోల్ దాటడానికి గంటల సమయం పడుతోంది. అధికారులు ఎన్ని ముందస్తు చర్యలు తీసుకున్నా, ఈ స్థాయి రద్దీని కంట్రోల్ చేయడం ఎవరి వల్ల కావడం లేదు. పిల్లలు, పెద్దలతో కలిసి ప్రయాణిస్తున్న వారు రోడ్లపైనే గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

## రూ.3000 కోట్ల భూమి స్వాధీనం

- హైడ్రా మరో సంచలన విజయం సాధించింది
- మియాపూర్‌లో రూ. వేల కోట్ల భూమిని కాపాడింది
- దీంతో హైడ్రాకు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది
- నిమిషాల మీద స్పందిస్తూ యాక్షన్ మొదలుపెట్టింది
- 15 ఎకరాల ప్రభుత్వ భూమినికి విముక్తి కలిగించింది

02



## తెలంగాణ గడ్డపై నిరుద్యోగ నిప్పు

- అశోక్ నగర్, చిక్కడపల్లిలో నిరుద్యోగుల నిరసన
- కాంగ్రెస్ నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం
- ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు
- నిరంకుశ పాలన అంటూ నినాదాలతో హోరెత్తించారు
- రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఏమైందని ప్రశ్న
- రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు

03



## పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వాలి




- నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ప్రీ బడ్జెట్ సమావేశం
- పాల్గొన్న తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- దేశాభివృద్ధిలో రాష్ట్రాలను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు
- 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యానికి సహకారం అందిస్తామన్నారు
- ద్రవ్య లోటు పరిమితిని కనీసం 4 శాతానికి పెంచాలని కోరారు
- మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం భారీగా నిధులు ఇవ్వాలి

02

## నేను సోషల్ డాక్టర్‌ను..!

- హెచ్ఐసీసీలో ఫెలోస్ ఇండియా కాన్ఫరెన్స్
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- రుగ్మతలను పరిష్కరించే సోషల్ డాక్టర్ అన్నారు
- నాయకులు సమాజ ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు
- ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పిలుపిచ్చారు
- తక్కువ ఖర్చుతో వైద్యం అందేలా చూడాలని కోరారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్య రంగానికి , ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తుపై కొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన ఫెలోస్ ఇండియా కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ చేసిన వ్యాఖ్యలు అటు వైద్యులలోనూ, ఇటు సామాన్య ప్రజలలోనూ పెద్ద చర్చకు దారితీశాయి. ప్రభుత్వం కేవలం హాస్పిటల్స్ కట్టడం మాత్రమే కాకుండా, ప్రజల ప్రాణాలను కాపాడే విధానాలను మరింత మెరుగుపరచడానికి వైద్యులతో నేరుగా కలిసి పనిచేయాలని నిశ్చయించుకోవడం శుభపరిణామం. వైద్యులు సమాజంలో పోషిస్తున్న పాత్ర వెలకట్టలేనిదని సీఎం గుర్తు చేస్తూనే, ప్రస్తుత కాలంలో మారుతున్న మిగతా 2లో..



## 217 మంది మృతి

- ఇరాన్‌లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి
- ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జనం రోడ్డెక్కారు
- ప్రజల పోరాటం ఇప్పుడు రక్తపాతానికి దారితీసింది
- టెహ్రాన్‌లో 217 మంది ప్రాణాలు కోల్పోయారు
- వారిలో అత్యధికులు యువకులే కావడం గమనార్హం
- ఈ ఉద్రిక్తతలు మరింత భారీ నష్టానికి దారితీసే ప్రమాదం

06

# పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ప్రీ బడ్జెట్ సమావేశంలో తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రయోజనాల కోసం గళమెత్తారు. దేశాభివృద్ధిలో రాష్ట్రాలను కూడా భాగస్వామ్యం చేయాలని సూచిస్తూనే, తెలంగాణ పురోగతికి అవసరమైన నిధుల కోసం గట్టిగా డిమాండ్ చేశారు. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యానికి తెలంగాణ పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇస్తూ, మన రాష్ట్ర జీడీపీ వాటాను ప్రస్తుతమున్న 5.1 శాతం నుండి 10 శాతానికి పెంచుతామనే ధీమాను వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వ భవిష్యత్తు ప్రణాళికలను వివరిస్తూ తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను భట్టి ఈ సందర్భంగా ప్రస్తావించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ భారీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే మౌలిక సదుపాయాల కల్పనపై పెట్టే పెట్టుబడిని ప్రస్తుతమున్న 37 శాతం నుండి 50 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని కేంద్రానికి వివరించారు. రాష్ట్రాల ఆర్థిక వెసులుబాటు కోసం ద్రవ్యలోటు పరిమితిని కనీసం 4 శాతానికి పెంచాలని కోరారు.ముఖ్యంగా విద్య , వైద్య రంగాల అభివృద్ధికి సేకరించే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నుంచి మినహాయించాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సమాజంలోని అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు మరియు కొత్త వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్రం తోడ్పాటునందించాలని కోరారు. మానవ వనరుల వికాసం




ద్వారానే ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. కేంద్ర పన్నుల పంపిణీలో రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని కూడా భట్టి ఈ సమావేశంలో ఎత్తిచూపారు. 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీ చేయాలని సిఫార్సు చేసినప్పటికీ, సెస్‌లు , సర్‌ఛార్జీల వల్ల రాష్ట్రాలకు కేవలం 30 శాతమే అందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తన పన్నుల రాబడిలో సెస్‌ల వాటాను 20 శాతానికి పెంచుకోవడం వల్ల రాష్ట్రాల ఆదాయానికి గండి పడుతోందని, దీనిపై పునరాలోచించాలని కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు.

తెలంగాణ రవాణా రంగానికి సంబంధించి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని భట్టి డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనితో పాటు హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన అనుమతులను త్వరితగతిన ఇచ్చి, పనులు ప్రారంభించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. నగర రద్దీని తగ్గించేందుకు మరియు పారిశ్రామికాభివృద్ధికి ఇవి ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచేందుకు హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఉన్న ప్రతిపాదనలను పరిశీలించి త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు మరియు జవహర్ నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణ విద్యార్థులకు మేలు జరుగుతుందని వివరించారు. ప్రతి జిల్లాకూ నాణ్యమైన కేంద్ర విద్యా సంస్థలు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానతను పెంచేందుకు పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్ మరియు కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలని భట్టి కోరారు. వీటి ద్వారా ఆయా ప్రాంతాల్లో పెట్టుబడులు పెరుగుతాయని, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ శ్రేణి నగరాలను కూడా ఆర్థిక కేంద్రాలుగా మార్చాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికగా ఉందని ఆయన వివరించారు. వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. దక్షిణ తెలంగాణ సాగునీటి అవసరాలను తీర్చే ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్రం నిధులు కేటాయిస్తే పనులు వేగంగా పూర్తవుతాయని చెప్పారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్రం నుంచి కూడా సహకారం అవసరమని, జాతీయ హోదా ఇవ్వడం ద్వారా ప్రాజెక్టు వ్యయం భారం తగ్గుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం భారీగా నిధులు కావాలని భట్టి కోరారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.14,100 కోట్లు కేటాయించాలని, అలాగే నగర రవాణాను మెరుగుపరిచే రేడియల్ రోడ్ల కోసం రూ.45 వేల కోట్లు అవసరమని వివరించారు. నగరం ఎదుర్కొంటున్న మురుగునీటి పారుదల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.17,212 కోట్లతో రూపొందించిన ప్రణాళికలకు కేంద్రం ఆర్థిక సాయం అందించాలని అభ్యర్థించారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం తమ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తుందని భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రాల అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందనే సూత్రాన్ని ఆయన నొక్కి చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం ప్రోత్సాహం అందిస్తే, రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర అవసరాలను, ప్రజల ఆకాంక్షలను కేంద్ర బడ్జెట్‌లో ప్రతిబింబించేలా చూడాలని ఆయన కోరారు.

## ఈనెల 12న రైలు నిలయానికి నేషనల్ ఎస్టీ కమిషన్ మెంబర్ జే హుస్సేన్



**ముషీరాబాద్,విశాలభారతి:** నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ మెంబర్ జే హుస్సేన్ ఈనెల 12న సికింద్రాబాద్ లోని రైలు నిలయం కు వస్తున్నారని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పివి రమణ తెలిపారు. అదే రోజు సోమవారం ఉదయం 10 గంటల నుండి సమావేశం హాల్లో రైల్వే లో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు ఇబ్బందులను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. ఏ సమస్య ఉన్న నేషనల్ ఎస్టీ మెంబర్ హుస్సేన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఉద్యోగస్తుల సమావేశం అనంతరం రైల్వే జీఎం ఉన్నతాధికారులు హెచ్ఓడీలతో రివ్యూ జరిపి ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ గొప్ప అవకాశాన్ని రైల్వే గిరిజన ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పీవీ రమణ కోరారు.

## క్వాటర్ ఫైనల్‌కు చేరిన జాతీయ కబడ్డీ పోటీలు

**ఉత్కంఠ భరితంగా సాగుతున్న క్రీడలు**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, ఏడూళ్ల బయ్యారం గ్రామంలో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న అండర్ 17 జాతీయ కబడ్డీ పోటీలు క్వాటర్ ఫైనల్ కు చేరుకున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి పోటీలకు హాజరైన జట్లు గెలిపే లక్ష్యంగా తలపడ్డాయి. క్వాటర్ ఫైనల్ కు చేరుకున్న జట్లు సెమీఫైనల్ లో స్థానం దక్కించుకునేందుకు ఉత్సాహకరంగా పోటీల్లో తలపడుతున్నాయి. ఆదివారంతో ఈ కబడ్డీ క్రీడల పోటీలు ఫైనల్ చేరుకుంటాయి. మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ఏడూళ్ల బయ్యారం గ్రామంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడంతో పోటీలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున జనం హాజరవుతున్నారు. వెనక పినపాక మండలంమే కాక అశ్వాపురం మణుగూరు బూర్గంపాడు మండలాల నుండి సైతం కబడ్డీ ప్రేమికులు ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతున్నారు. క్రీడాకారులు తలపడుతున్న తీరుకు ఆనందంతో కేరింతల కొడుతున్నారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులు సైతం వారి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ సూపర్ లను ఆకట్టుకుంటున్నారు.

# నేను సోషల్ డాక్టర్‌ను..!

**మొదటిపేజీ తరువాయి**

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. టెక్నాలజీ ఎంత పెరిగినా సరే, రోగి మనస్తత్వాన్ని , వారి నాడిని పట్టుకోవడంలో వైద్యులు ఎప్పుడూ ముందుండాలని ఆయన సూచించారు. డాక్టర్లు కేవలం చికిత్సకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను కూడా గుర్తుపెట్టుకోవాలని ఆయన కోరడం విశేషం. ప్రభుత్వం చేసే కృషికి వైద్యుల నైపుణ్యం తోడైతే తెలంగాణ ఆరోగ్య రంగంలో అద్భుతాలు సృష్టిస్తుందని ఆయన నమ్మకంగా చెప్పారు. ముఖ్యంగా పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించాలనే రేవంత్ రెడ్డి ఆలోచన చాలా బాగుంది. వైద్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠశాలల్లో సీపీఆర్ వంటి ప్రాణాలను కాపాడే పద్ధతులను విద్యార్థులకు నేర్పిస్తే, అత్యవసర సమయాల్లో ఎంతో మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. చిన్న వయసులోనే ఇలాంటి నైపుణ్యాలను నేర్చుకోవడం వల్ల పిల్లల్లో సేవా భావం పెరగడమే కాకుండా, సమాజానికి ఒక భద్రత ఏర్పడుతుంది. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న గుండె జబ్బులపై సీఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గుండె జబ్బుల నివారణ అనేది ఒక మిషన్ లాగా సాగాలని, ఇందులో ప్రభుత్వం మరియు వైద్యులు ఒక టీమ్ లాగా పనిచేయాలని పిలుపునిచ్చారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ హబ్ గా ఎదిగిందని, రాబోయే రోజుల్లో హెల్త్ కేర్ ఆవిష్కరణల్లో కూడా తెలంగాణ ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. దీని కోసం ప్రభుత్వం ఎలాంటి సహకారాన్నైనా అందించడానికి సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

రాజకీయ రంగంలో ఉంటూ సామాజిక సమస్యలను పరిష్కరించే బాధ్యతను తాను కూడా ఒక డాక్టర్‌లాగే భావిస్తానని రేవంత్ రెడ్డి సరదాగా



వ్యాఖ్యానించారు. సమాజంలో ఉన్న రుగ్మతలకు చికిత్స చేయడమే తన లక్ష్యమని ఆయన చెప్పడం ద్వారా ప్రజాసేవ పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. ప్రజారోగ్యం విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రతి సామాన్యుడికి నాణ్యమైన చికిత్స అందేలా పాలసీలను రూపొందించడంలో వైద్యుల సలహాలు ఎంతో కీలకమని ఆయన అంగీకరించారు. తెలంగాణ రాష్ట్రం ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. అందుకే వైద్యులు తమ పరిశోధనల ద్వారా కొత్త ఆవిష్కరణలను తీసుకురావాలని సీఎం కోరారు. రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ అనేది నిరంతర ప్రక్రియ అని, దీని ద్వారానే భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోగలమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, ప్రైవేటు రంగంలోని నిపుణుల సేవలను సమన్వయం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని ఆయన వివరించారు.

హైదరాబాద్ నగరం ఆవిష్కరణల కేంద్రంగా మారుతున్న క్రమంలో, ఇక్కడ తయారయ్యే మందులు, వైద్య పరికరాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాలని సీఎం కోరుకుంటున్నారు. స్థానికంగా ఉండే ప్రతిభను ప్రోత్సహిస్తూనే, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్య సేవలను సామాన్యుడికి అందుబాటులోకి తేవడమే లక్ష్యమని ఆయన చెప్పారు. వైద్య రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని, తద్వారా ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రేవంత్ రెడ్డి బలంగా నమ్ముతున్నారు. వ్యాధి సోకిన తర్వాత వైద్యం చేయడం కంటే, వ్యాధి రాకుండా నివారించే చర్యలపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో వైద్యులు కీలక పాత్ర పోషించాలని, కేవలం మందులు ఇవ్వడమే కాకుండా అవగాహన కల్పించడం కూడా వైద్యుల కర్తవ్యమని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యలో పారదర్శకత ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ పిలుపు వైద్య వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి, తమ వంతు సలహాలు అందించడానికి వైద్యులు సానుకూలంగా స్పందిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలను బలోపేతం చేసేందుకు త్వరలోనే మరిన్ని సంస్కరణలు వచ్చే అవకాశం ఉంది. విద్య, వైద్యం అనేవి ప్రాథమిక అవసరాలని గుర్తించిన ప్రభుత్వం, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల భవిష్యత్తులో తెలంగాణ గ్లోబల్ హెల్త్ మ్యాప్ పై ప్రత్యేక గుర్తింపు పొందడం ఖాయం. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ఆరోగ్య రంగం ఒక కొత్త మలుపు తిరుగుతోందని చెప్పవచ్చు. ప్రభుత్వం, వైద్యుల మధ్య బలమైన బంధం ఏర్పడటం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి. సీపీఆర్ వంటి ప్రాథమిక విద్యను పాఠశాలల్లో ప్రవేశపెట్టడం, టెక్నాలజీని మానవీయ కోణంలో ఉపయోగించడం వంటి నిర్ణయాలు తెలంగాణను ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతాయి. అందరూ కలిసి ఒకే లక్ష్యం కోసం పనిచేసినప్పుడే ఆరోగ్య తెలంగాణ కల సాకారం అవుతుంది.

# పల్లెకు పోదాం

**మొదటిపేజీ తరువాయి**

రైల్వే స్టేషన్లలో అయితే పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉంది. సంక్రాంతి కోసం రైల్వే శాఖ దాదాపు 800లకు పైగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నప్పటికీ, అవి ఏమాత్రం సరిపోవడం లేదు. రిజర్వేషన్లు ఓపెన్ చేసిన నిమిషాల్లోనే 'నో రూమ్' బోర్డులు కనిపిస్తున్నాయి. తత్కాల్ టికెట్ల కోసం ప్రయాణికులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ప్లాట్‌ఫారమ్‌ల మీద కనీసం అడుగు తీసి అడుగు వేయలేనంతగా జనాల రద్దీ పెరిగిపోయింది. ముఖ్యంగా ఏపీ, ఒడిశా వైపు వెళ్లే రైళ్లలో ప్రయాణికుల తాకిడి ఊహాతీతంగా ఉంది.

ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ కొన్ని వినూత్న మార్పులు చేపట్టింది. స్టేషన్లలో రద్దీని తగ్గించడానికి ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్లను పెద్ద సంఖ్యలో అందుబాటులోకి తెచ్చింది. అలాగే ఆన్‌లైన్‌లో జనరల్ టికెట్లు బుక్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించడంతో పాటు, కొన్ని రాయితీలు కూడా ఇస్తోంది. అయినా సరే, ట్రైన్ ఎక్కితే గానీ ఊరు చేరుకోలేమనే ఉద్దేశంతో ప్రజలు కిక్కిరిసిన భోగీల్లోనే ప్రయాణిస్తున్నారు. రైల్వే పోలీసులు పర్యవేక్షిస్తున్నా, ఈ విపరీతమైన రద్దీని మేనేజ్ చేయడం పెద్ద సవాలుగా మారింది. మరోవైపు ఆర్టీసీ బస్సుల పరిస్థితి కూడా అలాగే ఉంది. టికెట్లు దొరక్క ప్రయాణికులు బస్టాండ్లలో పడిగాపులు కాస్తున్నారు. తెలంగాణ ఆర్టీసీ ఈసారి రికార్డు స్థాయిలో ప్రత్యేక బస్సులను కేటాయించింది. కానీ ఏపీ వైపు వెళ్లే ప్రయాణికులకు మాత్రం ఈ స్పెషల్ బస్సుల చార్జీలు భారంగా మారుతున్నాయి. స్పెషల్ ప్రైస్ పేరుతో అదనపు బాదుడు ఉండటంతో మధ్యతరగతి జనాలు ఇబ్బందులు పడుతున్నారు. అయినా సరే, పండగకి ఇంటికి వెళ్లాలనే పట్టుదలతో ఆ భారాన్ని భరిస్తూనే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ రద్దీని చూసి ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు భారీగా దోచుకుంటున్నారు. ప్రభుత్వం హెచ్చరించినా, నిబంధనలు విధించినా వారు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. సాధారణ రోజుల్లో ఉండే చార్జీల కంటే




రెండు మూడు రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో సీట్లు ఖాళీ లేవని చూపిస్తూ, నేరుగా వచ్చే వారి దగ్గర వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. గత్యంతరం లేక సామాన్యులు తమ జేబులు గుల్ల చేసుకుని మరీ టికెట్లు కొంటున్నారు. ప్రైవేటు బస్సు ఆపరేటర్ల ఆగడాలు ఈ పండగ సీజన్‌లో పీక్ స్టేజ్‌కు చేరుకున్నాయి.

బస్సులు, రైళ్లలో టికెట్లు దొరకని వారు ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నారు. సొంత కార్లు లేని వారు 'లాంగ్ డ్రైవ్' వంటి కార్ రెంటల్ యాప్స్ ద్వారా వాహనాలను బుక్ చేసుకుంటున్నారు. వారం రోజుల ముందే కార్లను రిజర్వ్ చేసుకుని ఫ్యామిలీతో కలిసి ప్రయాణానికి ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే ఈ డిమాండ్ వల్ల కార్ రెంటల్ ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. అయినా కూడా కంఫర్ట్ కోసం, సమయానికి ఊరు చేరుకోవడం కోసం జనాలు వీటికే మొగ్గు చూపుతున్నారు. సోషల్ మీడియాలో కూడా ఇప్పుడు సంక్రాంతి ప్రయాణాల చర్చలే నడుస్తున్నాయి. ఫేస్‌బుక్, ఎక్స్ వంటి వేదికల్లో 'రైడ్ షేరింగ్' కోసం పోస్టులు పెడుతున్నారు. ఒకే ఊరికి వెళ్లే వారు కలిసి ప్రయాణం చేయడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇది కొత్త ట్రెండ్‌గా మారుతోంది. పెట్రోల్ ధరలు పెరగడం, టికెట్లు దొరకకపోవడంతో ఇలాంటి షేరింగ్ ప్రయాణాలు ఇప్పుడు చాలా మందికి వరంగా మారుతున్నాయి. ఈ క్రమంలోనే కొత్త కొత్త పరిచయాలు కూడా ఏర్పడుతున్నాయి. పట్టణాల్లోని కోలాహలం ఇప్పుడు నెమ్మదిగా పల్లెలకు షిఫ్ట్ అవుతోంది. రోడ్లపై ఎంత ట్రాఫిక్ ఉన్నా, ప్రయాణం ఎంత కష్టమైనా ఆఖరికి ఊరు చేరుకోగానే ఆ అలసట అంతా మాయమైపోతుంది. అమ్మ చేతి వంట, స్నేహితుల ముచ్చట్లు, భోగి మంటల చలికాచుకోవడం వంటి జ్ఞాపకాలు అందరినీ కష్టాలను మర్చిపోయేలా చేస్తున్నాయి. ఈ ప్రయాణాల కష్టాలు కేవలం మూడు రోజుల ముచ్చటే అయినా, ఆ తర్వాత వచ్చే పండగ ఆనందం మాత్రం చిరకాలం గుర్తుండిపోతుంది. మొత్తానికి ఈ సంక్రాంతి ప్రయాణాలు తెలుగు రాష్ట్రాల్లో ఒక జాతరను తలపిస్తున్నాయి. అటు ప్రభుత్వాలు, ఇటు అధికారులు ఎంత ప్రయత్నించినా పండగ రద్దీని నియంత్రించడం కష్టసాధ్యంగానే ఉంది. అయినా సరే, ఇన్ని అడ్డంకులను దాటుకుని ప్రతి ఒక్కరూ తమ సొంత ఇంటికి చేరుకోవాలని తాపత్రయపడుతున్నారు. ఈ రద్దీ, ఈ సందడి, ఈ ప్రయాణాల హడావిడే సంక్రాంతి పండగకు ఒక ప్రత్యేకతను తెచ్చిపెడుతోంది. పండగంటే కేవలం సంబరమే కాదు, అందరినీ కలిపే ఒక గొప్ప వారధి అని ఈ ప్రయాణాలు నిరూపిస్తున్నాయి.

# రూ.3000 కోట్ల భూమి స్వాధీనం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ మహానగరంలో చెరువుల పరిరక్షణ, ప్రభుత్వ భూముల రక్షణే ధ్యేయంగా దూసుకుపోతున్న హైడ్రా మరో సంచలన విజయాన్ని నమోదు చేసింది. అక్రమ కట్టడాలు, భూకబ్జాదారుల పాలిట సింహస్వప్నంగా మారిన ఈ ప్రత్యేక బృందం, తాజాగా మియాపూర్ ప్రాంతంలో వేల కోట్ల రూపాయల విలువైన భూమిని కాపాడింది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ఫీల్డ్‌లోకి దిగి తక్షణ చర్యలు చేపడుతుండటంతో నగర ప్రజల నుంచి హైడ్రాకు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. ఎక్కడ అక్రమ నిర్మాణం ఉన్నా, ఎక్కడ ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా నిమిషాల మీద స్పందిస్తూ యాక్షన్ మొదలుపెడుతోంది. తాజాగా మియాపూర్ విలేజ్ పరిధిలోని మక్తా మహబూబ్‌పేటలో హైడ్రా అధికారులు చేపట్టిన ఆపరేషన్ పెద్ద చర్చకు దారి తీసింది. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం దాదాపు మూడు వేల కోట్ల రూపాయలకు పైగా విలువ చేసే సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల చెర నుంచి విముక్తి కలిగించారు. తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని తమ సొంతం చేసుకోవాలని చూసిన కేటుగాళ్ల ప్రయత్నాలను అధికారులు సమర్థవంతంగా అడ్డుకున్నారు. ఈ ఆపరేషన్‌తో భూకబ్జాదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ముఖ్యంగా సర్వే నంబర్ 44లో ఉన్న ఈ భూమిపై గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. గతంలో 'హైడ్రా ప్రజావాణి'కి అందిన ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకున్న



కమిషనర్ ఏవీ రంగనాథ్, దీనిపై లోతైన విచారణకు ఆదేశించారు. అధికారుల బృందం పక్కా ఆధారాలతో రంగంలోకి దిగి, జరుగుతున్న భూ అక్రమాలను బట్టబయలు చేసింది. గతంలో కూడా ఇదే సర్వే నంబర్‌లో ఐదు ఎకరాల భూమిని హైడ్రా తన అదుపులోకి తీసుకోవడం గమనార్హం. మక్తా మహబూబ్‌పేట భూములకు సంబంధించిన వ్యవహారం కేవలం కబ్జాలకే పరిమితం కాలేదు, ఇందులో భారీ నెట్‌వర్క్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నకిలీ పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం, ఆపై ప్లాట్లుగా మార్చి విక్రయించడం వంటి భారీ కుట్రలు జరిగినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంలో ఒక సబ్ రిజిస్ట్రార్ కూడా సస్పెండ్ అవ్వడం చూస్తుంటే, అక్రమార్కుల మూలాలు ఎంత లోతుగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వ్యవస్థలోని లొసుగులను వాడుకుని ప్రభుత్వ ఆస్తులను దోచుకోవాలనుకున్న వారి ఆశలపై హైడ్రా నీళ్లు చల్లింది. సర్వే నంబర్ 44లో గల మొత్తం 43 ఎకరాల భూమిపై కబ్జాదారుల కన్నుపడిందని విచారణలో తేలింది. ఇందుకోసం వారు సర్వే నంబర్ 159కి చెందిన నకిలీ పత్రాలను అడ్డం పెట్టుకుని, సర్వే నంబర్ 44లోని భూమిని క్లెయిమ్ చేస్తున్నారు. ఈ అక్రమాలకు పాల్పడిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ భూమిని తన సొంత ఆస్తిగా చూపిస్తూ క్రయవిక్రయాలు సాగించడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. కేవలం భూమిని స్వాధీనం చేసుకోవడమే కాకుండా, భవిష్యత్తులో మళ్ళీ కబ్జాలకు గురికాకుండా హైడ్రా గట్టి చర్యలు చేపట్టింది. స్వాధీనం చేసుకున్న 15 ఎకరాల చుట్టూ ఇనుప కంచె వేసి భద్రతను కట్టుదిట్టం చేసింది. ఈ భూమి ప్రభుత్వానికి చెందినదని, ఇక్కడ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ భారీ సైన్ బోర్డులను ఏర్పాటు చేసింది. దీనివల్ల సామాన్య ప్రజలు కూడా మోసపోకుండా ఉండే అవకాశం ఉంటుంది. హైడ్రా దూకుడు మియాపూర్ ప్రాంతానికే పరిమితం కాలేదు. గతంలో మియాపూర్‌బాచుపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న చెరువు కట్టపై అక్రమంగా నిర్మించిన 18 షట్టర్లను కూడా అధికారులు నేలమట్టం చేశారు. నీటి వనరులను కాపాడటంలో హైడ్రా చూపిస్తున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. ప్రకృతి వనరులను ధ్వంసం చేస్తూ లాభపడాలనుకునే వారికి ఈ చర్యలు ఒక హెచ్చరికగా మారాయి. ఈ ఆపరేషన్లలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కూడా కీలకంగా మారింది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా యంత్రాంగం నిరంతరం సమాచారాన్ని సేకరిస్తోంది. ఎక్కడ తప్పుడు రిజిస్ట్రేషన్లు జరిగినా, వెంటనే సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకుంటుండటం విశేషం. దీనివల్ల ప్రభుత్వ యంత్రాంగంలో కూడా జవాబుదారీతనం పెరుగుతోంది. అక్రమార్కులకు సహకరించే వారు ఇకపై తప్పించుకోలేరనే సందేశాన్ని ప్రభుత్వం బలంగా పంపింది. తెలంగాణ రాజధానిలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, ప్రభుత్వ భూములను కాపాడటం అనేది పెద్ద సవాలుతో కూడుకున్న పని. రాజకీయ ఒత్తిళ్లు, పలుకుబడి ఉన్న వ్యక్తుల బెదిరింపులను ఖాతరు చేయకుండా హైడ్రా తన విధిని నిర్వహిస్తోంది. మూడు వేల కోట్ల విలువైన ఆస్తిని ఒక్క దెబ్బతో కాపాడటం అనేది హైడ్రా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. నగర ప్రజలు కూడా హైడ్రా పనితీరుపై సానుకూలంగా స్పందిస్తున్నారు. హైదరాబాద్ నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, చెరువులు మరియు ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. హైడ్రా తీసుకుంటున్న ఈ ధైర్యవంతమైన చర్యలు నగరాన్ని అక్రమార్కుల నుండి కాపాడతాయని ఆశిద్దాం.

## అంగనవాడి స్థలం కబ్జా


- **ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని వినతి**
- **దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకుంటానని ఎమ్మార్వో హామీ**

భద్రాచలం, విశాలభారతి: భద్రాచలం పట్టణంలోని శివారు ప్రాంతమైన రాజపేట కాలనీలో సుమారు 30 సంవత్సరాల కాలం లో సిపిఎం పార్టీ ఎమ్మెల్యే కుంజా బుజ్జి ఆధ్వర్యంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చారని అందులో ఒక స్థలాన్ని ఆ కాలనీ వాసులకు అంగనవాడి కేంద్రం ఏర్పాటుకు కేటాయించారని ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించారని వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకొని అంగన్వాడి స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడాలని అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, ఆదివాసి నాయకులు కంగాల రమణకుమారి రిపోర్టర్ గడ్డం సుధాకర్ రావు, స్థానిక నాయకులు నాదెండ్ల లీలావతి, ముంతాజ్ స్థానిక ఎమ్మార్వోకి వినతి పత్రం అందించారు ఎమ్మార్వో స్పందించి తక్షణమే సర్వే నిర్వహించి పూర్వపరాలు పరిశీలిస్తానని తగు న్యాయం జరిగే విధంగా చూస్తానని ఎమ్మార్వో హామీ ఇచ్చారని వారు అన్నారు.



# ప్రజల మనిషిపై పగ

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రస్థానం ఎప్పుడూ ఒక సంచలనమే





- బలమైన నేతగా ఎదిగిన ఆయన ప్రయాణంలో అనేక ఒడిదుడుకులు
- రాజకీయంగా దెబ్బతీయడానికి అనేక కుట్రలు జరిగాయనే ఆరోపణ
- తెలంగాణ సాధన కోసం మంత్రి పదవినే వదిలేసిన చరిత్ర వెంకటరెడ్డిది
- సినిమా పరిశ్రమతో కూడా ఆయనకున్న అనుబంధం ప్రత్యేకమైనది
- సామాన్య ప్రేక్షకులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుకుంటారు
- తన ఇమేజ్‌ను డ్యామేజ్ చేసే పెద్ద కుట్ర జరుగుతుందని చెబుతున్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

శనివారం హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, కొందరు తమ వ్యూస్, రేటింగ్స్ కోసం మహిళా అధికారులపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారుల వ్యక్తిగత జీవితాలను రోడ్డుపైకి లాగడం వల్ల వారు అనుభవించే మానసిక వేదనను ఎవరూ ఊహించలేరని, ఇది అత్యంత హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, సంబంధం లేని అధికారులను వివాదాల్లోకి లాగడంపై ఆయన విరుచుకుపడ్డారు. ఆవేదన భరించలేక, 'ఇది కూడా సరిపోదు అనుకుంటే నాకింత విషమిచ్చి చంపేయండి' అంటూ ఆయన చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. రాజకీయ కుట్రల వెనుక పెద్ద హస్తమే ఉందని, తన ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేందుకు కొందరు కావాలనే "క్యాబినెట్ లవ్" వంటి అర్థం లేని వివాదాలను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. తనకు పదవుల కన్నా విలువలే ముఖ్యమని, నాడు తెలంగాణ కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసిన చరిత్ర తనదని గుర్తు చేశారు. తన కుమారుడు ప్రతీక్ రెడ్డి మరణం తర్వాత సగం చనిపోయానని, మిగిలిన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశానని కోమటిరెడ్డి ఎమోషనల్ అయ్యారు. తన నిజాయితీని శంకించే వారికి కాలమే సమాధానం చెబుతుందని, అధికారులను వేధించడం ఆపాలని ఆయన హెచ్చరించారు.

సినిమాటోగ్రఫీ మంత్రిగా సినిమా టికెట్ ధరల పెంపు వ్యవహారంపై కూడా ఆయన కుండబద్దలు కొట్టారు. ఇటీవల పెద్ద సినిమాల టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, ఈ నిర్ణయంతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'పుష్ప 2' విడుదల సమయంలో జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మరణించిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఆ బాధతోనే సినీ పరిశ్రమ వ్యవహారాలకు కాస్త దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇకపై టికెట్ రేట్ల పెంపు కోసం నిర్మాతలు కానీ, సినీ పెద్దలు కానీ తన వద్దకు రావద్దని ఆయన ఖరాకండిగా చెప్పారు.

మంత్రి గొంతు సంబంధిత సమస్యతో బాధపడుతున్నప్పటికీ, బాధ్యతల పట్ల ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. అమెరికాలో చికిత్స చేయించుకున్నా గొంతు సమస్య పూర్తిగా తగ్గకపోవడంతో, వైద్యుల సూచన మేరకు తక్కువగా మాట్లాడుతున్నట్లు వివరించారు. తాను ఫోన్ నంబర్ మార్చానని వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. గత 20 ఏళ్లుగా వాడుతున్న పాత నంబర్ తన వద్దే ఉందని, నిరంతరం ఫోన్లు వస్తుండటంతో దానిని తన పీఏ వద్ద ఉంచానని క్లారిటీ ఇచ్చారు. ఆ నంబర్ ద్వారానే తాను ఆరుసార్లు ఎన్నికల్లో గెలిచి ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్నానని గుర్తు చేశారు. పరిపాలనా పరంగా కలెక్టర్ల బదిలీలు అనేది పూర్తిగా ముఖ్యమంత్రి పరిధిలోని అంశమని, అందులో మంత్రుల ప్రమేయం ఉండదని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. నల్గొండ జిల్లాలో నలుగురు కలెక్టర్లు మారిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇది కేవలం పరిపాలనాపరమైన ప్రక్రియే తప్ప వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని తేల్చి చెప్పారు. తన ఎదుగుదలను అడ్డుకోవడానికి ప్రత్యర్థులు ఎన్ని వ్యూహాలు పన్నినా, అవి తన ప్రజా బలం ముందు నిలబడలేవని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కుట్రలతో తనను రాజకీయంగా దెబ్బతీయడం ఎవరి తరమూ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. సినిమా రంగంపై తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, పరిశ్రమ మనుగడ ముఖ్యం కానీ అది సామాన్య ప్రేక్షకుడిపై భారం కాకూడదని ఆయన సూచించారు. నిర్మాతలకు లాభాలు రావాలి, అదే సమయంలో మధ్యతరగతి ప్రజలకు వినోదం అందుబాటులో ఉండాలనేదే తన లక్ష్యమని చెప్పారు. సినిమా టికెట్ల బ్లాక్ మార్కెట్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం సినిమా రంగానికి సహకరిస్తుందని భరోసా ఇస్తూనే, సామాన్యుల ప్రయోజనాలే పరమావధిగా అడుగులు వేయాలని కోరుకున్నారు.

రహదారులు, భవనాల శాఖ మంత్రిగా రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర రవాణా వ్యవస్థ మెరుగుపడితేనే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మే ఆయన, ప్రతిష్టాత్మకమైన రీజనల్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టుల కోసం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారు. గ్లోబల్ సమ్మిట్ వంటి కార్యక్రమాల్లో బిజీగా ఉంటూనే రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజీపడకుండా పోరాడుతున్నారు. క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం కావాలని అధికారులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రాజకీయ ప్రయాణంలో శత్రువుల కన్నా మిత్రులే ఎక్కువ ఉన్నారని ఆయన అనుచరులు చెబుతుంటారు. తన నియోజకవర్గ ప్రజలతో ఆయనకు ఉన్న పేగు బంధం ఎవరూ విడదీయలేనిది. తనపై ఎన్ని కుట్రలు జరిగినా, ఎన్ని ఆరోపణలు చేసినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, తన గళం ఎప్పుడూ ప్రజల పక్షానే వినిపిస్తుందని ఆయన స్పష్టం చేశారు. తనను ద్వేషించే వారిని కూడా ప్రేమతో గెలవాలనే తపన, ఆయన చేసే పనుల్లో స్పష్టంగా కనిపిస్తుంది. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యక్తిత్వం ఒక తెరిచిన పుస్తకం లాంటిది. వివాదాలు చుట్టుముట్టినా, విమర్శలు ఎదురైనా వాటిని ఎదుర్కొని నిలబడటమే ఆయన శైలి. సినిమా పరిశ్రమ సమస్యల నుంచి రాజకీయ కుట్రల వరకు ప్రతి అంశాన్ని ఆయన తనదైన శైలిలో డీల్ చేస్తున్నారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజల నమ్మకాన్ని కాపాడుకోవడమే ముఖ్యమని నమ్మే ఆయన, తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్రను కొనసాగిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు.

# తెలంగాణ గడ్డపై నిరుద్యోగ నిప్పు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గడ్డపై మరోసారి నిరుద్యోగ నిప్పు రాజుకుంది. చదువుల అడ్డాగా పేరుగాంచిన అశోక్ నగర్, చిక్కడపల్లి వీధులు నిరుద్యోగుల నిరసన గళాలతో హోరెత్తాయి. ఎన్నికల వేళ కోటి ఆశలు కల్పించి, అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు తమను నట్టేట ముంచిందని అభ్యర్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పండగ వేళ ఇంటికి వెళ్లకుండా, రేయింబవళ్లు కష్టపడి చదువుకుంటున్న విద్యార్థులు రోడ్డెక్కి తమ హక్కుల కోసం పోరాడుతుండటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగాల జాతర జరుగుతుందని ఆశపడ్డ యువతకు, పోలీసుల లాఠీలు ఎదురవ్వడం ఉద్రిక్తతలకు దారితీసింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించాలని నిరుద్యోగులు పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అయితే ఈ నిరసనను అడ్డుకునే క్రమంలో పోలీసులు అనుసరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చదువుకుంటున్న విద్యార్థులను లైబ్రరీ నుంచి బయటకు రానివ్వకుండా గేట్లకు తాళాలు వేయడం గమనార్హం. జైలును తలపించేలా అభ్యర్థులను లోపలే నిర్బంధించడంతో విద్యార్థులు ఆగ్రహంతో ఊగిపోయారు. ఇది ప్రజా పాలన కాదని, నిరంకుశ పాలన అంటూ నినాదాలతో హోరెత్తించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై ఇచ్చిన హామీ ఏమైందని నిరుద్యోగులు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. రెండేళ్లు గడుస్తున్నా జాబ్ క్యాలెండర్ ఊసే లేదని, నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసి కళ్లు కాయలు కాస్తున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. ముఖ్యంగా కొడంగల్ నుంచి వచ్చిన ఒక విద్యార్థి ఆవేదన అందరినీ కలిచివేసింది. రేవంత్ రెడ్డిపై నమ్మకంతో ఓటేశామని, కానీ ఆయనే తమ జీవితాలను నాశనం చేశారని సదరు విద్యార్థి కన్నీరు పెట్టుకున్నాడు. నమ్మినందుకు తమకు దక్కిన బహుమతి నిరుద్యోగమేనా అంటూ నిలదీశాడు. ప్రభుత్వ తీరుపై విరుచుకుపడుతున్న అభ్యర్థులు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీపై కూడా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పెట్టిన హామీలన్నీ ఇప్పుడు బుట్టదాఖలు అయ్యాయని విమర్శించారు. నిరుద్యోగ భృతి లేదు,



కొత్త కొలువులు లేవని ధ్వజమెత్తారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అంతకంటే దారుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ ఓట్లతో గద్దెనెక్కి ఇప్పుడు తమనే రోడ్డున పడేశారని, రాజకీయ నాయకులు తమ అవసరాల కోసం యువతను వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకప్పుడు నిరుద్యోగుల పక్షాన నిలిచిన ప్రొఫెసర్ కోదండరాం వంటి వారు కూడా ఇప్పుడు పదవులు రాగానే తమను మర్చిపోయారని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఉద్యమ సమయంలో అండగా ఉన్నవారే ఇప్పుడు ప్రభుత్వంలో ఉండి మౌనం వహించడం దారుణమని పేర్కొన్నారు. అధికారంలోకి రాకముందు పుస్తకాలు పక్కన పెట్టి తమకు మద్దతు ఇవ్వాలని కోరిన బల్మూరి వెంకట్ వంటి నేతలు, ఇప్పుడు నిరుద్యోగుల కష్టాలను పట్టించుకోవడం లేదని నిప్పులు చెరిగారు. పదవుల కోసం యువత భవిష్యత్తును తాకట్టు పెట్టారని నిరుద్యోగ జెఏసి నేతలు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి, అశోక్ నగర్ ఏరియాను ఒక కోటలా మార్చేశారు. నిరసన తెలుపుతున్న అభ్యర్థులను బలవంతంగా వ్యాన్లలోకి ఎక్కించి స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో పోలీసులకు, అభ్యర్థులకు మధ్య తోపులాట జరగడంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తమ శాంతియుత నిరసనను అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని నిరుద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. గతంలో రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చేసిన వ్యాఖ్యలను కూడా అభ్యర్థులు గుర్తు చేస్తున్నారు. అప్పట్లో ఆయన ఇతర నేతలపై చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు అదే విమర్శలు ఆయనకు వర్తిస్తాయని ఘాటుగా స్పందించారు. మాట తప్పినందుకు తమకు న్యాయం జరగకపోతే మరింత ఉధృతంగా నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. కేవలం ఐదు వేల ఉద్యోగాలతో సరిపెట్టాలని చూడటం నిరుద్యోగులను అవమానించడమేనని అభ్యర్థులు మండిపడుతున్నారు. లక్షలాది మంది అర్హులైన యువతకు మొండిచేయి చూపడం తగదని హితవు పలికారు. తెలంగాణ నిరుద్యోగ లోకంలో నెలకొన్న ఈ అసంతృప్తి సెగలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు కూడా పాకుతున్నాయి. సోషల్ మీడియా వేదికగా నిరుద్యోగులు ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నారు. పండగ పూట కళ్లల్లో నీళ్లు తెప్పించిన ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని సోషల్ మీడియా పోస్టులు వైరల్ అవుతున్నాయి. రాజకీయ సమీకరణాలు ఎలా ఉన్నా, ఒక విద్యార్థి ఆవేదన మరియు ఆకలి కేకలు రాష్ట్ర భవిష్యత్తుకు ప్రమాదకరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా నిరుద్యోగ గండం నుంచి బయటపడాలంటే ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టమైన జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో సచివాలయాన్ని ముట్టడిస్తామని కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా, లాఠీ ఛార్జీలు చేసినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అభ్యర్థులు భీష్మించుకుని కూర్చున్నారు. తమ ఆవేదనను వినకుండా అణచివేయాలని చూడటం ప్రభుత్వానికి మంచిది కాదని నిరుద్యోగ సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. మొత్తానికి హైదరాబాద్ వీధుల్లో నిరుద్యోగుల గర్జన తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తోంది. ఎన్నికల హామీల అమలులో జరుగుతున్న జాప్యం యువతలో తీవ్ర అసహనానికి దారితీసింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ఉద్రిక్తతలను ఎలా చల్లారుస్తుందో చూడాలి. నిరుద్యోగులు అడుగుతున్నది కేవలం తమకు రావలసిన ఉద్యోగాలే అని, అవి ఇవ్వకుండా కాలయాపన చేయడం వల్ల రాష్ట్రంలో అశాంతి నెలకొనే ప్రమాదం ఉందని విద్యావంతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పట్టణాలను నాశనం చేశారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ప్రస్తుతం అత్యంత వేడెక్కింది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. ఒకప్పుడు పాలనలో ఉన్న గులాబీ దళం, ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రానున్న మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా రసవత్తరంగా మారింది. పట్టణ ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా తెలంగాణలోని పట్టణాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని కేటీఆర్ మండిపడ్డారు. పట్టణ ప్రగతిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందని, ప్రజల కష్టాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. అసలు ఏ ముఖం పెట్టుకుని కాంగ్రెస్ నేతలు ఓట్లు అడుగుతారని ఆయన సూటిగా ప్రశ్నించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి కేవలం మాటలకే పరిమితమైన ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన జోస్యం చెప్పారు. ఇది ప్రజా ఆగ్రహానికి నాంది అని ఆయన అభివర్ణించారు. నిధుల కేటాయింపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండేళ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా పట్టణాల అభివృద్ధికి ఖర్చు చేయని ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీయేనని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ పట్టణానికైనా ప్రత్యేకంగా నిధులు కేటాయించారా అని ప్రశ్నించారు. ఒకవేళ తాము అభివృద్ధి చేశామని భావిస్తే, ఆ నిధుల వివరాలను ప్రజల ముందు ఉంచి ఓట్లు అడగాలని ఆయన సవాల్ విసిరారు. అభివృద్ధి లేకుండా ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఖమ్మం, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పార్టీ శ్రేణులతో కేటీఆర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కీలక సమావేశంలో పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావుతో పాటు ఆయా జిల్లాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన పార్టీ క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో చర్చించి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ఆయన పార్టీ నేతలకు సూచించారు.




పట్టణాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని, వీధి దీపాల నుంచి మంచినీటి సరఫరా వరకు ప్రతిదీ అస్తవ్యస్తంగా మారిందని ఆయన విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కళకళలాడిన పట్టణాలు, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో వెలవెలబోతున్నాయని ఎద్దేవా చేశారు. కనీస మౌలిక వసతులు కల్పించడంలో వైఫల్యం చెందిన ఈ ప్రభుత్వం, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే పాకులాడుతోందని ఆయన ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. తాము నిర్మించిన భవనాలకు, రోడ్లకు తిరిగి శిలాఫలకాలు వేయడం తప్ప ఈ ప్రభుత్వం కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా మొదలు పెట్టలేదన్నారు. నిధుల కొరత సాకుతో కమ్యూనిటీ హాళ్లు, మోడల్ మార్కెట్లు వంటి కీలక ప్రాజెక్టులను అర్థాంతరంగా నిలిపివేశారని ఆరోపించారు. దీని వల్ల ప్రజా ధనం వృథా కావడమే కాకుండా, పట్టణ ప్రజలకు చేరాల్సిన సౌకర్యాలు అందకుండా పోతున్నాయని ఆయన పేర్కొన్నారు.

రైతాంగం, పట్టణ ఆర్థిక వ్యవస్థ రెండూ ఇప్పుడు సంక్షోభంలో ఉన్నాయని కేటీఆర్ విశ్లేషించారు. ఒకవైపు గ్రామాల్లో రైతులకు భరోసా లేదని, మరోవైపు పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆయన అన్నారు. వ్యవసాయాన్ని గాలికొదిలేసి, పట్టణాలను పట్టించుకోకుండా ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని విమర్శించారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, కానీ కాంగ్రెస్ వచ్చాక అది పూర్తిగా ఆగిపోయిందని మండిపడ్డారు. ఈ అస్తవ్యస్త పాలనపై ప్రజల్లో ఉన్న అసహనమే రానున్న ఎన్నికల్లో ఫలితాలను నిర్ణయిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికార పార్టీ వేధింపులను, అధికార దుర్వినియోగాన్ని ఎదుర్కొని బీఆర్ఎస్ మంచి ఫలితాలను సాధించిందని ఆయన గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఐక్యంగా పోరాడాలని చెప్పారు. కార్యకర్తలు అధైర్య పడకుండా ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని, విజయం మనదేనని ఆయన భరోసా ఇచ్చారు. ప్రతి వార్డులోనూ పార్టీ పరిస్థితిని స్వయంగా సమీక్షించిన ఆయన, వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల వ్యూహం ఎలా ఉండాలి, ప్రజల్లోకి వెళ్లేటప్పుడు ఎలాంటి అంశాలను ప్రస్తావించాలి అనే విషయాలపై హరీష్ రావు స్పష్టతనిచ్చారు. గ్రూపు రాజకీయాలకు తావులేకుండా కలిసికట్టుగా ఉండి బీఆర్ఎస్ జెండాను మున్సిపాలిటీలపై ఎగురవేయాలని ఆయన నేతలను కోరారు.

# మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఓరుగంటి బ్రహ్మం

**కోదాడ, విశాలభారతి:**

కోదాడ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో రాష్ట్ర మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిన్నపరెడ్డి అధ్యక్షతన జరిగిన మిల్లర్ల సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షునిగా ఓరుగంటి వెంకట బ్రహ్మం, ప్రధాన కార్యదర్శిగా కొత్త బ్రహ్మయ్య, కోశాధికారిగా నరేంద్రుని నాగేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా పశ్యా నవీన్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా మట్టా కృష్ణారెడ్డి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, గౌరవ సలహాదారులుగా జి సత్యనారాయణ, కే నర్సిరెడ్డి లను మిల్లర్లు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బ్రహ్మం మాట్లాడుతూ తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన మిల్లర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మిల్లర్లు ఎదుర్కొనే ఏ విధమైన సమస్యలకైనా సామరస్య పూర్వక పరిష్కార మార్గాలకు ప్రయత్నిస్తానన్నారు. అధికారులకు, మిల్లర్లకు, హమాలీలకు సమన్వయకర్తగా పనిచేస్తూ వివాదరహితంగా మిల్లర్స్ అసోసియేషన్ బాధ్యతలను నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మిల్లర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## లిఫ్ట్ పనులను త్వరగా పూర్తిచేయాలి

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**అశ్వాపురం, విశాలభారతి :** మారేళ్లపాడు లిఫ్టు పనులలో వేగం పెంచి, ఈ ఏడాది మార్చి నాటికి పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని బిజీ కొత్తూరు సమీపంలో గల సీతారామ పంప్ హౌస్ కాలువ వద్ద మారెళ్ళ పాడు లిఫ్ట్ ఇరిగేషన్ కోసం చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. మండల రైతం గానికి సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును త్వరతిగతిన పూర్తి చేస్తే వేలాది ఎకరాలకు సాగు నీ రంది రైతులు బంగారం పండిస్తారన్నారు. మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించిన పనులలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అనుకున్న సమయానికి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి వచ్చే ఖరీఫ్ నాటికి రైతులకు నీరందించాలన్నారు. పనులలో మరింత వేగం పెంచి అనుకున్న సమయంలోపు ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరుగంటి బిక్షమయ్య, గాదె కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

- మహిళల ఉత్సాహభరిత పాల్గొనడం
- విజేతలకు బహుమతుల ప్రదానం

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

ఎల్.బి. నగర్ నియోజకవర్గం పరిధిలోని మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలో కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేసి పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి,జక్కిడి సత్య తేజ రెడ్డి హాజరై ముగ్గుల పోటీలో విజయం సాధించిన మహిళలకు బహుమతులు అందజేశారు.ఈ పోటీలో ప్రథమ



బహుమతి - రూ.5,000, ద్వితీయ బహుమతి - రూ.3,000, తృతీయ బహుమతి - రూ.2,000 అందజేయడంతో పాటు, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి వివిధ రకాల కన్సలేషన్ బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ..సంక్రాంతి వంటి పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు.మహిళల ప్రతిభను ప్రోత్సహించేలా ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జడ్జెస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అంజయ్య గౌడ్, రంగారెడ్డి, కుమారస్వామి, వాసుకే, ఓంకార్, వెంకట రెడ్డి, యాదగిరితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యామల్ రెడ్డి, పృథ్వీ రాజు, ఇరిగి రమేష్, గంట్ట శ్రవణ్, జకీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసభ ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**విశాలభారతి, గోదావరిఖని:** ఆదివారం గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో జరగనున్న భారీ ప్రజాసభకు అన్ని ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు పాల్గొననున్నరు ఈ సందర్భంగా,సభా స్థలాన్ని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం ఎమ్మెల్యే శ్రీ ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ స్వయంగా పరిశీలించారు.వేదిక ఏర్పాటు నుంచి ప్రజల సౌకర్యాలు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా సమీక్షించిన ఎమ్మెల్యే, కార్యక్రమం విజయవంతం కావాలంటే సమన్వయంతో పనిచేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణ శ్రీ , సంబంధిత ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖనిలో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్



**విశాలభారతి, గోదావరిఖని:** ఆదివారం రోజున రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహిరంగ సభ కు ఐటీ శాఖ మంత్రివర్యులు, మంథని శాసనసభ్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్న నేపథ్యంలో బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి రాజ్యలక్ష్మి గార్డెన్స్ మార్కండేయ కాలనీ లో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ సమగ్ర బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ. సభా ప్రాంగణంలో వేదిక, పబ్లిక్ గ్యాలరీ, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ఎంట్రీ -ఎగ్జిట్ మార్గాలు, వి ఐ పి, పబ్లిక్ వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్, సభకు హాజరు అయ్యే వారికోసం ఏర్పాట్లు చేసిన భోజనాల ప్రాంతంలో, తదితర భద్రత ఏర్పాట్లపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సభ ప్రశాంతంగా సాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలని ఏసీపీ సూచించారు. కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రవీందర్, రామగుండం సిఐ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు,లింగమూర్తి, మంథని సీఐ బి. రాజు, ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్ రావు, ఆర్ ఐ దామోదర్, శ్రీనివాస్, ఎస్ ఐ లు, ఆర్ ఎస్ ఐ లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్వ హిందీ దివాస్ హిందీ వర్క్‌షాప్



**విశాలభారతి, గోదావరిఖని:** విశ్వ హిందీ దివాస్ సందర్భంగా ఎన్ టిపిసి రామగుండంలో హిందీ వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ సందర్భంగా వర్క్‌షాప్ రెండు సెషన్స్ గా నిర్వహించబడింది. ఇందులో భాగంగా హిందీ వర్క్‌షాప్ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని అధికారిక భాషా విభాగం కన్సల్టెంట్ అయినా కేవల్ కృష్ణన్ దీనికి ముఖ్య నాయకత్వం వహించారు. ఆయన నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ఎన్ ఐ సిలో శాస్త్రవేత్తగా కూడా పనిచేశారు. హిందీ ప్రభావవంతమైన మీడియాలో దాని పాత్రపై దృష్టి సారించి స్థానిక జర్నలిస్టుల కోసం మొదటి సెషన్ నిర్వహించచారు. ముఖ్య అతిధిగా హెచ్ ఆర్ బిజోయ్ కుమార్ సిక్దార్ హాజరయ్యారు. రెండవ సెషన్ ఈడీ ఆర్ & టి చందన్ కుమార్ సమంత సమక్షంలో ఎన్ టి పి సి రామగుండం ఉద్యోగుల కోసం సెషన్స్ జరిగింది. అధికారిక మరియు సాంకేతిక పనులలో హిందీ ఆచరణాత్మక ఉపయోగాన్ని సెషన్ అని. ఎన్ టి పి సి రామగుండంలో అధికారిక భాషా హిందీ వాడకాన్ని ప్రోత్సహించే దిశగా ఈ వర్క్‌షాప్ ప్రశంసనీయమైన చొరవగా ఉపయోగపడుతుంది అని తెలిపారు.

## శిశు మందిర్ పాఠశాలలు నిరంతర శిక్షణా కేంద్రాలు



**ఆదిలాబాద్, విశాలభారతి:** పూర్వ ప్రాధానాచార్యులు ఒరగంటి ఇస్తారి శిశు మందిర్ పాఠశాలలు నిరంతర శిక్షణా కేంద్రాలుగా ఉండి నైపుణ్యాలు గల ఉపాధ్యాయులను తయారు చేస్తూ అత్యుత్తమ ప్రతిభ గల విద్యార్థులను దేశానికి అందించుటలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ఓరగంటి ఇస్తారి గారు అన్నారు. ఇచ్చోడ మండల కేంద్రము లోని స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఇచ్చోడ,బజార్ హత్నూర్, నేరేడిగొండ, గుడిహత్నూర్,బోథ్ శిశు మందిర్ పాఠశాలల ఆచార్యులకు నిరంతర శిక్షణ వర్గలలో భాగంగా మాసవ ర్గ నిర్వహించారు. పాఠశాల అధ్యక్షులు ప్రభుత్వ ఉపాధ్యాయులు దేవర్ల సంతోష్ కమ్యూనికేషన్ ఇంగ్లీష్ లో మెళకువలు గురించి క్లాస్ తీసుకున్నారు.వివిధ విషయాలు ఇంగ్లీష్,సైన్స్,తెలుగు,సదాచారం, శారీరక శిక్షణ లో ఎలా బోధించాలో విషయ నిపుణులు తరగతులు నిర్వహించారు.ఈ మాసవర్గ లో ప్రైమరీ,ప్రీ ప్రైమరీ తరగతుల ఆచార్యులకు శిక్షణ ఇవ్వడం జరిగింది.పాఠశాల కమిటీ సభ్యులు రాజేందర్, సుదర్శన్,సంతోష్,శేఖర్ ప్రధానాచార్యులు సంతోష్ కుమార్,వెంకట రమణ,మీన,రమాదేవి వివిధ పాఠశాలల నుండి సుమారు 45 మంది ఆచార్యులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని పరామర్శించిన మధుయాష్కి గౌడ్

**మోకాలికి శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిపై ఆరా**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జాన రెడ్డిని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ మధుయాష్కి గౌడ్ శనివారం వారి నివాసానికి మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ జాన రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరితగతిన పూర్తి ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని కూడా సూచించారు.జాన రెడ్డి తనను పరామర్శించిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రస్తుతం తన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు దారుణ హత్య

**రాజేంద్రనగర్,విశాలభారతి:** శంషాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు దారుణంగా హత్యకు గురయ్యాడు. యువకుని మెడపై బలమైన గాయంతో పడి మృతి చెంది ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం ను రప్పించి ఆధారాలను సేకరించారు... కేసు వివరాలను ఆర్జీఐఏ క్రైం ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ వెల్లడించారు.. తమిళనాడు పుదుకొట్టయ్ ప్రాంతానికి చెందిన చిన్నరాసు నారాయణ స్వామి అనే యువకుడు మధురానగర్ స్ట్రీట్ నెంబర్ 3 లో అర్ధరాత్రి పడిపోయి ఉన్నాడని స్థానికులు చెప్పారని అన్నారు. తెల్లవారేసరికి మెడపై బలమైన గాయంతో మృతి చెందాడని తెలిపారు. సమీపంలో పందులు ఎక్కవగా తిరుగుతూ ఉంటాయి పందులు ఏమైనా కరిచాయా? లేదంటే ఇంకా ఏమైనా అయి ఉంటుందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తునట్టు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ తెలిపారు.

## ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి
- సీసీటీవీ కెమెరాల పనితీరును తప్పనిసరిగా పరిశీలించాలి

**విశాలభారతి, గోదావరిఖని:**




రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన ప్రజలు పండుగలు, సెలవులు, వివాహాలు తదితర సందర్భాల్లో ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని,చోరీలు మరియు ఇతర నేరాలు జరగకుండా స్వీయ రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో సూచించారు.ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే ముందు తలుపులు,కిటికీలు, గేట్లు సక్రమంగా మూసి ఉన్నాయా లేదా అన్న విషయాన్ని పూర్తిగా పరిశీలించుకోవాలని తెలిపారు.అలాగే ఇళ్లలో లేదా ఇంటి పరిసర ప్రాంతాల్లో అమర్చిన సీసీటీవీ కెమెరాలు సరిగా పనిచేస్తున్నాయా, రికార్డింగ్ జరుగుతోందా,నైట్ విజన్ సదుపాయం సక్రమంగా ఉందా అనే అంశాలను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు.ఇంటర్నెట్ సదుపాయం కలిగిన సీసీటీవీ కెమెరాలైతే మొబైల్ ఫోన్ యాప్ ద్వారా లైవ్ ఫుటేజ్ వీక్షించే విధంగా ముందుగానే సెటప్ చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా,ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే విషయాన్ని పొరుగువారికి లేదా నమ్మకమైన వ్యక్తికి ముందుగా తెలియజేయడం, అవసరమైతే సంప్రదింపు ఫోన్ నంబర్ ఇవ్వడం భద్రతకు మరింత దోహదపడుతుందని తెలిపారు. రాత్రి సమయాల్లో ఇంటి వెలుపల లైట్లు వెలిగేలా టైమర్ ఏర్పాటు చేసుకోవడం వల్ల ఇల్లు ఖాళీగా ఉందనే అనుమానం కలగకుండా ఉంటుందని వివరించారు.ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా కదలికలు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని,లేదా డయల్ 100 లేదా 112కు ఫోన్ చేయాలని పోలీస్ కమిషనర్ ప్రజలను కోరారు.

## సోమనాథ ఆలయ పునర్నిర్మాణానికి 75 ఏళ్లు



- ఫతేనగర్ శివాలయాల్లో ప్రత్యేక పూజలు
- బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్

**కూకట్ పల్లి, విశాలభారతి:**

సోమనాథ ఆలయం విధ్వంసం అనంతరం పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమనాథ ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న మన ప్రధాని నరేంద్ర మోదీ సూచన మేరకు ఫతేనగర్ ప్రాంతంలోని వివిధ శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ధార్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివునికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమనాథ ఆలయ చరిత్ర, దాని పునర్నిర్మాణ ప్రాముఖ్యతపై ఆలయ నిర్వాహకులు భక్తులకు వివరించారు. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో సోమనాథ ఆలయం ప్రతీకగా నిలిచిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాల్లో భజనలు, హోమాలు నిర్వహించడంతో పాటు దేశ శ్రేయస్సు ప్రజల శాంతి సౌభాగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి.

## ఘనంగా మెగా సిటీ హై స్కూల్ 28వ వార్షికోత్సవం

**వేలాది జీవితాలకు వెలుగు నింపిన విద్యాలయం**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**




రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండలంలో గత 28 సంవత్సరాలుగా స్థానిక ప్రజలకు నాణ్యమైన విద్య అందిస్తూ వేలాది విద్యార్థుల జీవితాలకు వెలుగు నింపుతున్న ప్రముఖ విద్యాసంస్థ మెగా సిటీ హై స్కూల్ 28వ వార్షికోత్సవాన్ని శుక్రవారం లక్ష్మారెడ్డి పాలెంలోని ఎస్.ఎన్.ఆర్ కళా కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మోటివేషన్ స్పీకర్ డా. టి. వేణుగోపాల్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) శ్రీనివాసులు, ఉమేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు .ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి ఎంతో అవసరమని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులను మానసికంగా, శారీరకంగా బలంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని, తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ..మెగా సిటీ హై స్కూల్ గత 28 సంవత్సరాలుగా విద్యను కేవలం ఉపాధి సాధనంగా కాకుండా జీవన మార్గదర్శకంగా అందిస్తున్న విద్యాలయమని తెలిపారు. తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు నేడు ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, పోలీసు అధికారులు సహా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నత పదవుల్లో స్థిరపడటం ఎంతో గర్వకారణమన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని, నాణ్యమైన విద్య అందించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు.విద్యార్థులు ప్రతిభతో పాటు సామాజిక బాధ్యత కలిగిన ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు, నాటికలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభకు హాజరైన అతిథులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ప్రదీప్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ శ్వేత, ప్రిన్సిపాల్ వరలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జాతీయ స్థాయిలో జంప్ రోప్ ఛాంపియన్లుగా తెలంగాణ క్రీడాకారులు




**కూకట్‌పల్లి, విశాలభారతి:** చెన్నైలో జరిగిన 22వ సబ్‌జూనియర్ నేషనల్ జంప్ రోప్ ఛాంపియన్‌షిప్, 20వ ఫెడరేషన్ కప్ పోటీలలో తెలంగాణ క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి రికార్డు స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారు. తెలంగాణ జంప్ రోప్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మేసా రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణ మార్గదర్శకత్వంలో తెలంగాణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటారు. 14 బంగారు పతకాలు, 8 వెండి పతకాలు, 12 కాంస్య పతకాలతో మొత్తం 34 పథకాలు సాధించారు. కఠోర శ్రమ క్రమశిక్షణతో తెలంగాణ పేరును జాతీయ వేదికపై నిలబెట్టిన యువ ఛాంపియన్లందరిని తెలంగాణ జంప్ రోప్ అసోసియేషన్ (టీ.జే.ఆర్.ఏ) జనరల్ సెక్రటరీ మేసా రాజేంద్రప్రసాద్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉర్సు కార్యక్రమంలో పాల్గొన్న జక్కిడి శివ చరణ్ రెడ్డి

**యువజన కాంగ్రెస్ నేత ఇజ్జగాని సత్యం కుటుంబానికి ఆర్థిక సహాయం**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో ముస్లిం సోదరులు నిర్వహించిన ఉర్సు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉర్సు వేడుకలలో పాల్గొని శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం సమాజంలో మరింత బలపడాలని ఆకాంక్షించారు. అనంతరం వైరా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు క్రి.శే. ఇజ్జగాని సత్యం (నిప్పు) ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందడంతో, వారి నివాసానికి వెళ్లిన జక్కిడి శివ చరణ్ రెడ్డి వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. యువజన కాంగ్రెస్ తరపున మృతుని కుటుంబానికి రూ.50,000 ఆర్థిక సహాయం అందజేసి, వారి పిల్లల భవిష్యత్తుకు ఎల్లవేళలా యువజన కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యరమల రామ్ రెడ్డి, ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయి, అలాగే జిల్లా, నియోజకవర్గం, పలు మండలాల యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సత్యం టెక్నో స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు

**ముఖ్య అతిథిగా దండెం రాంరెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే వేషధారణలు, రంగురంగుల ముగ్గులు, విద్యార్థుల కోలాటాలతో పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని సత్యం టెక్నో స్కూల్‌లో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.సత్యం టెక్నో స్కూల్ యాజమాన్యం ఆహ్వానం మేరకు శనివారం రోజు స్కూల్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలు, సంక్రాంతి వేడుకల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకులు దండెం రాంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా దండెం రాంరెడ్డి మాట్లాడుతూ.. ముందుగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు తదుపరి తరాలకు చేరాలనే ఉద్దేశంతోనే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సాంస్కృతిక అవగాహన పెంపొందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.సంక్రాంతి సందడితో నిండిన ఈ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంతో కళకళలాడించాయి. ఈ కార్యక్రమంలో సత్యం టెక్నో స్కూల్ చైర్మన్ గుజ్జ సత్యం దంపతులు, బి స్మార్ట్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నారాయణ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ అరవింద్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై భారీగా వాహనాల రద్దీ

- ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక కుంభమేళా ఆరంభం
- రైళ్లు, బస్సులే కాదు... హైవేలు కిక్కిరిసిన దృశ్యం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి పండుగతో పాటు సాంస్కృతిక కుంభమేళా ఆరంభం కావడంతో ప్రయాణికుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. రైళ్లు, బస్సులు మాత్రమే కాకుండా జాతీయ రహదారులు కూడా వాహనాలతో కిక్కిరిసిపోయాయి.సంక్రాంతి సెలవుల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి తమ సొంత గ్రామాలకు వెళ్లే ప్రజలతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వాహనాల రద్దీ నెలకొంది. ముఖ్యంగా ఎల్‌బీ నగర్, చింతలకుంట, వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, అబ్దుల్లాపూర్ మెట్, బాటసింగారం ప్రాంతాల మీదుగా వెళ్లే విజయవాడ హైవేలో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది.చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరి నిలిచిపోయాయి. వాహనాలు మెల్లగా కదులుతుండటంతో ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపైనే సతమతమవుతున్నారు. కొందరు ప్రయాణికులు ఎట్టాకేలకు తమ గమ్యస్థానాలను చేరుకునే విధంగా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టోల్ ప్లాజాల వద్ద అదనపు సిబ్బంది నియమించి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని కోరుతున్నారు.

# 217 మంది మృతి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఇరాన్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు అత్యంత భయానక వాతావరణాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు రోడ్ల మీదకు వచ్చి చేస్తున్న పోరాటం ఇప్పుడు రక్తపాతానికి దారితీసింది. మరీ ముఖ్యంగా టెహ్రాన్ వంటి ప్రధాన నగరాల్లో నిరసనకారులపై భద్రతా దళాలు కనికరం లేకుండా ప్రవర్తిస్తున్నాయి. టైమ్ మ్యాగజైన్‌కు అందిన సమాచారం ప్రకారం, కేవలం టెహ్రాన్ నగరంలోనే సుమారు 217 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అక్కడి వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత సమాచారం ప్రకారం ఈ ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో అత్యధికులు యువకులే కావడం గమనార్హం. దేశ భవిష్యత్తు కోసం గొంతు ఎత్తిన యువతపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఉత్తర టెహ్రాన్‌లోని ఒక పోలీస్ స్టేషన్ వెలుపల జరిగిన సంఘటన అత్యంత విషాదకరంగా మారింది. నిరసనకారులను అడ్డుకోవడానికి భద్రతా దళాలు ఏకంగా మెషిన్ గన్లతో కాల్పులు జరపడం వల్ల అక్కడికక్కడే 30 మంది ప్రాణాలు వదిలారు. ఈ ఘటన ఇరాన్ ప్రభుత్వ అణచివేత ధోరణికి అద్దం పడుతోంది.

ఇరాన్ ప్రభుత్వం వ్యూహాత్మకంగా సమాచార వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, ఫోన్ కనెక్షన్లను కట్ చేయడం ద్వారా అక్కడ ఏం జరుగుతుందో ప్రపంచానికి తెలియకుండా చేస్తోంది. దీంతో బాధితుల వివరాలు కానీ, మరణాల సంఖ్య కానీ స్పష్టంగా బయటకు రావడం లేదు. అంతర్జాతీయ మీడియా కొన్ని గణాంకాలను వెల్లడిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అంతకంటే భయంకరంగా ఉందన్నది కాదనలేని వాస్తవం. ప్రభుత్వ ఆంక్షల వల్ల వాస్తవాలు వెలుగులోకి రావడం లేదు. అంతర్జాతీయ మీడియా సంస్థలు ఇరాన్ మరణాల సంఖ్యపై భిన్నమైన కథనాలను ఇస్తున్నాయి. అధికారికంగా సుమారు 65 మంది చనిపోయారని కొన్ని వార్తా సంస్థలు చెబుతుంటే, స్థానిక వైద్యులు మాత్రం మరణాల సంఖ్య వందల్లో ఉందని హెచ్చరిస్తున్నారు. సమాచార కొరత కారణంగా వాస్తవ గణాంకాలను సేకరించడం కష్టసాధ్యంగా మారింది. ఏది ఏమైనా, అక్కడ జరుగుతున్న హింస మాత్రం అంతర్జాతీయ సమాజాన్ని కలవరపెడుతోంది. ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం చేస్తున్న దాడులు విమర్శలకు గురవుతున్నాయి.

ఇక ఈ ఉద్రిక్తతలపై ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ చేసిన వ్యాఖ్యలు మంటల్లో నెయ్యి పోసినట్లుగా ఉన్నాయి. ఈ నిరసనల వెనుక విదేశీ శక్తుల కుట్ర ఉందంటూ ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ చేతులు ఇరాన్ ప్రజల రక్తంతో తడిచాయని, ఆయన్ను సంతోషపెట్టడం కోసం ఇరాన్ ప్రజలు తమ సొంత వీధులను నాశనం చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకుంటోందని ఆయన ఆరోపిస్తున్నారు. ఖమేనీ ప్రసంగం నిరసనకారులను మరింత రెచ్చగొట్టే విధంగా ఉంది. సొంత దేశ ప్రజల బాధను అర్థం చేసుకోవాల్సింది పోయి, వారిని విదేశీ ఏజెంట్లుగా చిత్రీకరించడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ప్రజల ఆవేదనను గుర్తించకపోగా, వారిపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం వల్ల ఆందోళనలు మరింత ఉధృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా సాగాల్సిన నిరసనలు ఇప్పుడు హింసాత్మక పోరాటాలుగా మారుతున్నాయి.

ఇదే సమయంలో ప్రవాసంలో ఉన్న ఇరాన్ యువరాజు రెజా పహ్లావి స్పందించారు. ఇరాన్ ప్రజలను కాపాడాలంటూ ఆయన అంతర్జాతీయ సమాజానికి, ముఖ్యంగా అమెరికాకు విన్నవించారు. దేశంలో ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలను అడ్డుకోవాలని ఆయన కోరారు. అమాయక ప్రజలు తమ ప్రాణాలను కోల్పోతున్నారని, ఈ విపత్కర సమయంలో ప్రపంచ దేశాలు మౌనంగా ఉండకూడదని ఆయన పిలుపునిచ్చారు. అమెరికా జోక్యం చేసుకుంటేనే ఇక్కడి ప్రజలకు రక్షణ లభిస్తుందని ఆయన విశ్వసిస్తున్నారు. పహ్లావి చేసిన విజ్ఞప్తి ఇప్పుడు అమెరికా విదేశాంగ విధానంపై ఒత్తిడి పెంచుతోంది. నిరసనకారులపై ప్రభుత్వం చేస్తున్న దాడులను అరికట్టడానికి దౌత్యపరమైన ఒత్తిడి అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్ ప్రభుత్వం తన స్వార్థం కోసం ప్రజల గొంతు నొక్కేస్తోందని, దీనివల్ల మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికలపై ఈ అంశాన్ని గట్టిగా వినిపించాలని ఆయన కోరుతున్నారు. ప్రస్తుతం ఇరాన్‌లో పరిస్థితి అగాధంలో పడిపోయినట్లు కనిపిస్తోంది. ఒకవైపు ప్రాణాలు కోల్పోతున్న సామాన్యులు, మరోవైపు తన పంతాన్ని వీడని ప్రభుత్వం మధ్య యుద్ధం నడుస్తోంది. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక ఆంక్షలు ప్రజలను రోడ్లపైకి తెచ్చాయి. కానీ ప్రభుత్వం వాటిని పరిష్కరించే మార్గాన్ని వెతకకుండా హింసతో అణచివేయాలని చూడటం దురదృష్టకరం. ఈ ఘర్షణలు ఎప్పుడు ముగుస్తాయో, ఇంకా ఎంతమంది బలి కావాల్సి ఉంటుందో ఎవరికీ అర్థం కావడం లేదు. మొత్తానికి ఇరాన్ నిరసనలు కేవలం ఒక దేశానికి పరిమితమైన సమస్యగా కాకుండా అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరణాల సంఖ్య పెరుగుతుండటం, మానవ హక్కుల ఉల్లంఘన జరగడం వల్ల ప్రపంచ దేశాలు ఈ విషయంలో స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇరాన్ ప్రజల గొంతు ప్రపంచానికి వినిపించాలంటే ఇంటర్నెట్ ఆంక్షలు తొలగాలి. అప్పుడే అక్కడ జరుగుతున్న వాస్తవాలు ప్రపంచానికి తెలుస్తాయి. శాంతియుత పరిష్కారం లభించకపోతే ఈ ఉద్రిక్తతలు మరింత భారీ నష్టానికి దారితీసే ప్రమాదం ఉంది.

# విద్యార్థి నాయకులపై అక్రమ కేసుల

- బిఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు సిందం శ్రీకాంత్



**కూకట్ పల్లి, విశాలభారతి:** డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడానికి ప్రజల్లో అవగాహన పెంచే మంచి ఉద్దేశంతో బిఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మియాపూర్ త్రివేణి స్కూల్ సమీపంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని అనుమతి లేనన్న నెపంతో కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బిఆర్ఎస్ రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు సిందం శ్రీకాంత్ మండిపడ్డారు. సామాజిక బాధ్యతతో యువతకు డ్రగ్స్ నుండి దూరంగా ఉండాలని చైతన్యం కల్పించినందుకు విద్యార్థి నాయకుడు రాజుపై కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. ఈ నేపథ్యంలో మియాపూర్ పోలీస్ ఇన్స్పెక్టర్‌ను కలిసి వివరాలు తెలుసుకుని రాజుకు కావలసిన న్యాయపరమైన సహాయం పార్టీ తరఫున అందిస్తామని ఆయన తెలిపారు. ఒకవైపు ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలన పేరుతో కార్యక్రమాలు చేపడుతూనే మరోవైపు ప్రతిపక్ష పార్టీలు అదే లక్ష్యంతో చేసే కార్యక్రమాలను అడ్డుకోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని శ్రీకాంత్ విరుచుకుపడ్డారు. ఇటీవలి కాలంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా సహించలేక తొలగించడం ఇప్పుడు విద్యార్థులపై కేసులు పెట్టడం చౌకబారు రాజకీయాలన్నారు. ఇలాంటి చర్యలపై ప్రజలు రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో తప్పకుండా గుణపాఠం చెబుతారని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నవతారెడ్డి, కిరణ్ యాదవ్, వ్వాళ్ల హరీష్ రావు, పరునంది శ్రీకాంత్, నరేందర్ యాదవ్, మాజీద, వద్దే రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెతనం కళ్ళకుకట్టేలా చిన్నారుల సంక్రాంతి సంబరాలు

- సంస్కృతి సంప్రదాయాలపై చిన్నారులకు అవగాహన అవసరం
- కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి



**కేశంపేట, విశాలభారతి:** పల్లెల్లో పండుగ సంస్కృతిని కళ్లకు కట్టేలా చిన్నారులు చేసిన సంక్రాంతి సంబరాల విన్యాసాలు అద్భుతమని, మన సంస్కృతి సంప్రదాయాలపై చిన్నారులకు చిన్నప్పటినుంచి అవగాహన అవసరమని కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి అన్నారు. శనివారం కేశంపేట మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలోని వీఐపీ పబ్లిక్ స్కూల్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు ముత్యాల ముగ్గులతో, భోగిమంటలతో, కనుమ కోలాహలంతో, చిన్నారుల సంక్రాంతి ఆటపాటలతో అలరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సంప్రదాయ కార్యక్రమాలతో పల్లె వాతావరణాన్ని ఆవిష్కరించారని, సంక్రాంతి వైభోగాన్ని కళ్ళకు కట్టినట్టుగా చూపించిన చిన్నారులందరికీ, స్కూల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. అన్నదాత రైతు యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొన్న తల్లులలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, అతిథులు పాల్గొన్నారు.

# సినిమా షూటింగ్‌కు వెళ్తున్న బస్సు బోల్తా



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** పెద్ద అంబర్‌పేట పరిధిలో తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సినిమా షూటింగ్ కోసం వెళ్తున్న బిగ్ పిక్చర్స్ సంస్థకు చెందిన TS13 FB 3649 నెంబర్ గల బస్సు పెద్ద అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభంలో డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ బస్సు విశాఖపట్నం నుంచి బయలుదేరి మణికొండ వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్ బీరం విజయ భాస్కర్ రెడ్డి, ఆయన తండ్రి నర్సిరెడ్డి, అలాగే ఎలక్ట్రిషన్ పుట్టా బీసన్న ఆయన తండ్రి బీసన్న మాత్రమే ఉన్నారు. ఈ ఘటనలో డ్రైవర్ విజయ్‌కు ఎడమ చేతికి స్వల్ప గాయాలు కాగా, మిగిలినవారు స్వల్పంగా గాయపడి ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను సాఫీగా కొనసాగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీస్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు

# పుస్తేల తాడును తీసుకెళ్లిన దొంగలు



**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ పోలీస్ స్టేషన్ పరిధి కుమ్మరి బస్తీలో జయమ్మ అనే మహిళ ప్రతిరోజులాగే ఇంటివాకిలి ఊడుస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వెనక నుంచి ఒకడు వచ్చి నా మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెల తాడిని బలంగా లాగాడు. ఒక్కసారిగా భయంతో కేక వేసాను. తాడు తెగిపోయి పుస్తెలు చేతిలో పట్టుకుని అతడు పరారయ్యాడు. ఆ పుస్తెల తాడు నా పెళ్లి జ్ఞాపకం... నా జీవితానికి గుర్తు. ఇలా దోచుకెళ్లడం చాలా బాధగా ఉంది. భయంతో ఇంకా వణికిపోతున్నాను. వెంటనే కుటుంబ సభ్యుల సహాయంతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాను. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలని, మాకు న్యాయం చేయాలని పోలీసులను కోరుతున్నాను.

# మందిరాలను కాపాడుకోవాలి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి:** మందిరాలను కాపాడుకోవాలి అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ అన్నారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ 2026 సోమనాథ్ ఆలయంపై 1025 జనవరిలో గజనీ మహమ్మద్ దాడి చేసి 2026 నాటికి 1000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 1951లో ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా అమృతోత్సవం పేరుతో భారత ప్రధాని నరేంద్ర మోదీ జనవరి 11న సోమనాథ్ క్షేత్రంలో సహస్ర సంకల్పయాత్ర ప్రారంభిస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు. నరేంద్ర మోడీ పిలుపుమేరకు శనివారం బౌద్ధ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ లోని అంబర్ నగర్ సీతారామాంజనేయ శివ పంచాయతన దేవాలయంలో బౌద్ధనగర్ సీతారామాంజనేయ దేవాలయం లో గల శివాలయాలలో ఓంకార జపం అభిషేక పూజలు నిర్వహించడం జరిగిందని, దేవాలయాలను మన సొంత ఇంటి కంటే ఎక్కువగా కాపాడుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్, నేతి సత్యనారాయణ, కొమరయ్య, నాగరాజ్, భరద్వాజ్, వెంకట చైతన్య, ఒములు, శ్యామ్ ముదిరాజ్, జయంత్, శ్రీశైలం, సత్యనారాయణ, లడ్డూ, నాని, రాఘవేంద్ర, చిన్న, అశోక్, సాయి ప్రసాద్, దీపక్, సంతోష్, శ్రీధర్, రూప్ సాయి, రోహిత్, బాలయ్య, గజరాజు పాల్, నవీన్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**కేశంపేట, విశాలభారతి:** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన కొవ్వూరు అరుణరవిపంతులుకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ మాజీ ఉప సర్పంచ్ పంది రామ్ రెడ్డి శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఇటీవల ఆమె అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చికిత్స పొందింది. గ్రామ బిఆర్ఎస్ నాయకులు ఆమె అనారోగ్య విషయాన్ని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన 60 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, శేఖర్ పంతులు, యారం శేఖర్ రెడ్డి, రామచందర్, నరేందర్ రెడ్డి, లింగందన సర్పంచ్ నాగిళ్ల వెంకట్, గుబ్బ సుదర్శన్, గోష్కే నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ దిష్టి బొమ్మను దగ్ధం చేసిన కాంగ్రెస్ నాయకులు



**సికింద్రాబాద్, విశాల భారతి:** రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ల పై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి ఆదం సంతోష్ కుమార్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు సికింద్రాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అనంత కృష్ణారావు నేతృత్వంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసి ధర్నాకు రోడ్డుపై కూర్చోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కె.సాయికుమార్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు సాయినాథ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆర్ సందీప్, రోషన్ లాల్, తార్నాక యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరుద్, సికింద్రాబాద్ సోషల్ మీడియా కార్డినేటర్ కార్తీక్, కమల్, ప్రశాంత్ పాల్, నవీన్, అభిషేక్, హేమంత్, వికాస్ యాదవ్, సాయితేజ, మహేందర్, విజయ్, తదితరులు పాల్గొని నిరసన తెలపడం జరిగింది.

# గాంధీ పేరును తొలగించడం దేశ చరిత్రకు అవమానం

**కాంగ్రెస్ నేతల ఆగ్రహం**



**సికింద్రాబాద్, విశాలభారతి:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అమానుషమైన చర్య అని, ఇది బీజేపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా తీసుకున్న రాజకీయ నిర్ణయమని కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా విమర్శించారు. శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని సీతాఫలమండిలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు దీపక్ జాన్, అదం సంతోష్ కుమార్, కోట నీలిమ మాట్లాడుతూ మహాత్మా గాంధీ పేరు భారతదేశానికి మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా అహింస, సత్యం, శ్రమకు ప్రతీకగా నిలిచిందని అన్నారు. అలాంటి మహనీయుడి పేరును ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడం ద్వారా బీజేపీ ప్రభుత్వం తన గాంధీ వ్యతిరేక భావజాలాన్ని మరోసారి బహిర్గతం చేసిందని ఆరోపించారు. దేశంలో పేదలు, కూలీలు, గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించిన అత్యంత కీలకమైన పథకానికి గాంధీ పేరు జత చేయడం వెనుక లోతైన తత్వం ఉందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ లాల్, జగ్గు, జాంగిర్, అనిల్, చక్రధర్, కల్పన, శిల్ప చారి, సందీప్ రాజ్, షకిల్ ఖాన్, అమర్, ఇసాక్, సతీష్, శ్యామ్, జై కుమార్, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

# సంక్రాంతి ఊరికి వెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త




**పాల్వంచ రూరల్ ఎస్ఐ బి. సురేష్**

**పాల్వంచ, విశాలభారతి:** సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు ఇళ్లను ఖాళీగా వదిలి వెళ్లే సమయంలో దొంగతనాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ బి. సురేష్ సూచించారు. ఇంటికి తాళం వేసి వెళ్లే ముందు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, నగదు, బంగారం తదితర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో లేదా ఇతర సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచుకోవాలని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా చలనం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ఆస్తి భద్రత కోసం పాల్వంచ రూరల్ పోలీసులు పండుగ సీజన్‌లో నిరంతర గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేరాలు జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా, నేరాలను ముందుగానే నివారించడం కూడా పోలీసుల బాధ్యతేనని, ఇందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రజలు సహకరిస్తే దొంగతనాలను పూర్తిగా అరికట్టవచ్చని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. పండుగ సీజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ఇళ్ల భద్రతకు పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# 3సంక్రాంతి పండగకు ఊరు వెళ్ళేదెలా?

**పలు బస్టాండ్ లో ప్రయాణికుల అవస్థలు!**



**హైదరాబాద్, విశాలభారతి:** సంక్రాంతి పండుగ హడావు డి మొదలైంది ప్రధానంగా నగరాల నుంచి పల్లెలకు వెళ్లే జనం శుక్రవారం సాయంత్రం నుంచే క్యూ కట్టారు. దీంతో హైదరాబాద్ నగరం బిజీబిజీగా కనిపిస్తుంది శుక్రవారం రాత్రి నుంచి సొంతూరుకు పయనమవుతున్నారు. నగరవాసులు ప్రధానంగా ఏపీ, తెలంగాణలోని గ్రామాలకు వెళ్లే ప్రయాణికు లతో అటు రైల్వే స్టేషన్ల, ఇటు బస్టాండ్లు రద్దీగా మారాయి. సంక్రాంతి పండగ పూట సొంత ఊర్లకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులతో పాటు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది, సంక్రాంతి పండుగ సంద ర్భంగా ప్రత్యేక బస్సులు నడపాల్సిన ఆర్టీసీ అధికారులు బస్సులు సమయానికి నడపక పోవడంతో శనివారం తెలంగాణ జిల్లాల్లోని కొన్ని బస్టాండ్లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. వచ్చిపోయే బస్సుల కోసం ప్రయాణికులు పరుగులు తీయడం, సీట్ల కోసం కుస్తీలు పడడం వంటి దృశ్యాలు కనిపించాయి. కాలేజీలకు, హాస్టళ్లకు, స్కూళ్లకు శనివారం నుంచి సెలవులు ప్రకటించడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది.

# కీలక కేసులను ఛేదించిన మల్కాజిగిరి పోలీసులు

**విశాలభారతి, మల్కాజిగిరి:**

మల్కాజిగిరి కమిషనరేట్ సైబర్‌క్రైమ్ పోలీసులు జనవరి మొదటి వారంలో నిర్వహించిన దర్యాప్తులో భాగంగా రెండు కీలక కేసులను ఛేదించి, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. డిజిటల్ అరెస్ట్ మరియు పెట్టుబడి మోసాలకు పాల్పడుతున్న దేశవ్యాప్త నెట్‌వర్క్‌ను గుర్తించిన పోలీసులు, నిందితుల నుంచి కీలక సమాచారాన్ని సేకరించారు. బాధితులకు ఊరటనిస్తూ, గౌరవనీయ న్యాయస్థానం ద్వారా సుమారు 56 లక్షల రూపాయల పైచిలుకు మొత్తాన్ని తిరిగి ఇప్పించడంలో పోలీసులు విజయం సాధించారు. ఈ వారంలో నమోదైన ప్రధాన కేసులో, ట్రాయ్, క్రైమ్ బ్రాంచ్ అధికారులమని నటిస్తూ ఒక వృద్ధుడిని భయపెట్టి 90 లక్షల రూపాయలు కాజేసిన ముఠా గుట్టురట్టయింది. నకిలీ వీడియో కాల్స్ మరియు సుప్రీం కోర్టు విచారణ పేరిట బాధితుడిని మానసిక ఒత్తిడికి గురిచేసి ఈ భారీ మోసానికి పాల్పడ్డారు. ఈ దర్యాప్తులో భాగంగా మోసగాళ్లకు తన బ్యాంక్ ఖాతాను అద్దెకు ఇచ్చిన సికింద్రాబాద్‌కు చెందిన కోలా మంజుల అనే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో సదరు మహిళపై ఇతర రాష్ట్రాల్లో కూడా ఐదు కేసులు ఉన్నట్లు వెల్లడైంది. మోసపోయిన బాధితుడికి ఇప్పటికే 41 లక్షల రూపాయలను పోలీసులు రికవరీ చేసి అందించారు. ప్రధాన నిందితుడు గోయల్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేస్తూనే, ఇలాంటి నేరాల్లో బ్యాంక్ ఖాతాలను అద్దెకు ఇవ్వడం లేదా విక్రయించడం తీవ్రమైన నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి పోలీసులు హెచ్చరించారు. ప్రజలు గుర్తుతెలియని వ్యక్తుల నుండి వచ్చే వీడియో కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పుడూ డిజిటల్ అరెస్టులు చేయరని పోలీసులు స్పష్టం చేశారు. ఏదైనా అనుమానం కలిగినా లేదా మోసపోయినా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండటం మరియు వ్యక్తిగత వివరాలను పంచుకోకపోవడమే ఈ తరహా మోసాల నుండి రక్షణ పొందే మార్గమని పిఆర్ఓ మల్కాజిగిరి సూచించారు.

# రేషనలైజేషన్ పేరుతో పాఠశాలల మూసివేతకు కుట్ర






- మతాన్ని చొప్పించి విద్యను కాషాయీకరణ
- వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ ప్రాధానలక్ష్యం
- దీన్ని వ్యతిరేకించాలని పిలుపు

**కొత్తగూడెం, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కుట్ర పన్నుతున్నదని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక సిద్ధార్థ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ అధ్యక్షతన జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ కౌన్సిల్ సమావేశమునకు ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగానికి నిధుల కేటాయింపులో కోత పెడుతూ, ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులను నింపకుండా, పాఠశాలల భౌతిక పరిస్థితులు మెరుగుపరచకుండా, ప్రభుత్వ విద్యను ప్రభుత్వం ప్రజలకు దూరం చేస్తున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ 2025 బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టిందని, సిలబస్లో మతాన్ని చొప్పించి విద్యను కాషాయీకరణ చేయుటకు పూనుకున్నదని, దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దేశంలో విద్యను ప్రైవేటు శక్తులకు అప్పగిస్తూ, బడుగు బలహీనవర్గాలకు విద్యను అందకుండా చేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని, అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను సాధించు కోవాలని కోరినారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎం.రామాచారి, అధ్యక్షులుగా జి.హరిలాల్, అసోసియేట్ అధ్యక్షులుగా డి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పహీం బాయ్, పి.మంగయ్య, పి.రవి, ఎం.అంతోని, పి.సత్యనారాయణ, ఎండి.మౌలానా, సిహెచ్.వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా వి.వినోదిని, అసోసియేట్ ప్రధాన కార్యదర్శిగా బి.బ్రహ్మచారి, కార్యదర్శులుగా ఎం.శివ ప్రశాంత్, డి.ప్రణయ్ కుమార్, సిహెచ్.రమేష్, కె.వెంకటేశ్వర్లు, పి.నాగభూషణం ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వై.అశోక్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎం.సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రవిచంద్ర, కార్యవర్గ సభ్యులు వి.మనోహర్ రాజు, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు, పివైఎల్ జిల్లా అధ్యక్షులు పి.మంగయ్య, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం.శివ ప్రశాంత్, డి.ప్రణయ్ కుమార్, టీపీఎఫ్ జిల్లా కార్యదర్శి వై.ప్రశాంత్ పాల్గొన్నారు.

# వనవాసీ విద్యార్థి నిలయంకు వితరణలు





**చర్ల, విశాలభారతి:**

వనవాసీ విద్యార్థి నిలయంకు పలువురు దాతలు వితరణలను అందచేసారు. బీర గోపాల్, మాధవి దంపతుల కుమార్తె భువనేశ్వరి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేసారు. హైదరాబాదులో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న భువనేశ్వరి మాట్లాడుతూ తాను కూడా పేద కుటుంబం నుండి వచ్చానని, ఈ రోజు జన్మదినం సందర్భంగా భోజనం ఏర్పాటు చేయడం సంతోషం కలిగిస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జీవితంలో స్థిరపడటం ద్వారా ఇతరుల చదువులకు సహకరించాలని విజ్ఞప్తి చేసారు. మరోవైపు ఆయిల్ బంక్ ఏరియాలో గల శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ అర్చకులు విద్యార్థులకు టవల్స్, దుస్తులను అందచేసారు. దాతలకు నిలయ కమిటీ కృతజ్ఞతలు తెలియచేసింది. కార్యక్రమంలో వనవాసీ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి, కమిటీ సభ్యుడు లవన్ కుమార్ రెడ్డి, బీర గోపాల్, మాధవి, సతీష్, భువనేశ్వరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




# నయా మాల్స్.. రియాల్టీ కమాల్

## హైదరాబాద్ రియల్ ఎస్టేట్లో మారుతున్న దిశ

### కోర్ సిటీ నుంచీ శివారు ప్రాంతాల వరకూ విస్తరణ వినోద–వాణిజ్య సామ్రాజ్యంగా మాల్స్

ఒకప్పుడు రియల్ ఎస్టేట్ అంటే ఇండ్లు, కార్యాలయాలకే పరిమితమయ్యేది. ఇప్పుడు ఆ సీన్ పూర్తిగా మారింది. నగర రియల్ ఎస్టేట్ రంగంలో మాల్స్, మల్టిప్లెక్స్‌లు కీలకంగా మారాయి. వినోదం, షాపింగ్, ఫుడ్ కోర్ట్ అన్నీ ఒకే చోట లభించే సంస్కృతి హైదరాబాద్ ప్రజల జీవనశైలిని మార్చడంతో భూమి విలువలు, పెట్టుబడుల దిశను కూడా కొత్త మలుపు తిప్పుతోంది.

- విశాలభారతి, హైదరాబాద్



### నగర ముఖచిత్రాన్ని మార్చిన మాల్స్

హైదరాబాద్‌లో మాల్స్ విస్తరణ ఒక దశలో లగ్జరీగా ప్రారంభమై, ఇప్పుడు అవసరంగా మారింది. సరత్ సిటీ క్యాపిటల్ మాల్ నగర రిటైల్ రియల్ ఎస్టేట్‌కు మైలురాయిగా నిలిచింది. సుమారు 27 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇది హైదరాబాద్‌లోనే అతిపెద్ద మాల్. ఇనార్బిట్ మాల్ (8 లక్షల చదరపు అడుగులు), జీవీకే వన్ మాల్ (7.5 లక్షలు), లూలు మాల్ (5 లక్షలు) వంటి ప్రాజెక్టులు నగరాన్ని ‘షాపింగ్ హబ్’గా నిలబెట్టాయి. ఈ మాల్స్‌లో ఒక్కోటి 200 నుంచి 350 వరకు బ్రాండ్లు, విస్తృత ఫుడ్ కోర్టులు, పిల్లల గేమింగ్ జోన్లు, మల్టిప్లెక్స్‌లు ఉన్నాయి. దీంతో ఒక మాల్ చుట్టూ వాణిజ్య చట్రం మొత్తం అభివృద్ధి చెందుతోంది. మాల్ ప్రారంభమైన ప్రాంతాల్లో రహదారి విలువలు, అద్దెలు, భూమి ధరలు గణనీయంగా పెరిగినట్లు రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి.




### మల్టిప్లెక్స్‌ల ప్రభావం

మాల్స్‌తో పాటు మల్టిప్లెక్స్‌లు హైదరాబాద్ వినోద రంగాన్ని పూర్తిగా మార్చాయి. పీవీఆర్–ఇనాక్స్, ఏఎంబీ సినిమాస్ వంటి ప్రీమియం థియేటర్లు ప్రేక్షకుల అంచనాలను పెంచాయి. సౌండ్, స్క్రీన్, సీటింగ్తో ఆల్ ఇన్ వన్ అనుభూతి కోసం ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రాబోయే 2026 నాటికి నగరంలో కొత్త స్క్రీన్ల సంఖ్య భారీగా పెరగనుంది. ఓడియన్ మాల్‌లో 8 స్క్రీన్లు, లేక్‌షోర్ మాల్‌లో 9 స్క్రీన్లు, అపర్ణ, ఏఎంబీ మాల్‌లో 7 స్క్రీన్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో మల్టిప్లెక్స్ ఆధారిత రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు పెట్టుబడిదారుల ఆసక్తి మరింత పెరుగుతోంది.




### శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్

ఇంతవరకు నగర కేంద్రంలోనే కనిపించిన మాల్స్ ట్రెండ్ ఇప్పుడు శివారు ప్రాంతాలకు విస్తరిస్తోంది. కూకట్‌పల్లి, గచ్చిబౌలి, మాధాపూర్ ప్రాంతాల్లో ఫోరం సుజానా, నెక్సస్ మాల్స్ ఇప్పటికే జనాన్ని ఆకర్షిస్తున్నాయి. వీటి ప్రభావంతో ఆ ప్రాంతాల్లో నివాస ప్రాజెక్టుల డిమాండ్ పెరిగింది. ఇక కొంపల్లి, శంషాబాద్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో పీఎంఆర్ మాల్, అపర్ణ మాల్ వంటి కొత్త ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. విమానాశ్రయానికి సమీపంగా ఉండే శంషాబాద్ ప్రాంతంలో మాల్స్ రావడం వల్ల హోటల్స్, సర్వీస్ అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలపై ఆసక్తి పెరుగుతోంది. రియల్ ఎస్టేట్ నిపుణుల అంచనా ప్రకారం, 2025–26 కాలంలో హైదరాబాద్‌లో 16.6 మిలియన్ చదరపు అడుగుల కొత్త మాల్ స్పేస్ మార్కెట్‌లోకి రానుంది. ఇది దేశంలోనే అతిపెద్ద రిటైల్ విస్తరణలలో ఒకటిగా భావిస్తున్నారు.

### ఉపాధి–ఆర్థిక ప్రభావం

మాల్స్ కేవలం షాపింగ్ సెంటర్లు మాత్రమే కాదు... ఉపాధి కేంద్రాలు కూడా. ఒక్కో పెద్ద మాల్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయి. సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్, రిటైల్ సేల్స్, ఫుడ్ కోర్టులు, మల్టిప్లెక్స్ సిబ్బందితో అనేక రంగాలకు ఇది జీవనాధారం. అంచనాల ప్రకారం, సరత్ సిటీ మాల్‌కు రోజుకు సగటున 19,100 మంది, నెక్సస్ మాల్‌కు 14,500 మంది సందర్శకులు వస్తున్నారు. ఈ స్థాయి ఫుట్‌ఫాల్ చుట్టుపక్కల చిన్న వ్యాపారాలకు కూడా ఆదాయం పెంచుతోంది.


### భవిష్యత్ దిశ


హైదరాబాద్ రియల్ ఎస్టేట్ భవిష్యత్తులో మాల్స్, మల్టిప్లెక్స్‌లు కీలక పాత్ర పోషించనున్నాయి. కానీ ఈ వృద్ధి సుస్థిరంగా ఉండాలంటే మెట్రో కనెక్టివిటీ, రింగ్ రోడ్లు, పార్కింగ్ పాలసీలు, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో సమతుల్య అభివృద్ధి జరిగితేనే రియల్ ఎస్టేట్ వృద్ధి ప్రజలకు ప్రయోజనకరంగా మారుతుంది. ఇక ఇళ్ల ధరలు, వాణిజ్య అద్దెలు, పెట్టుబడుల ప్రవాహం అన్నీ మాల్స్ చుట్టూనే తిరుగుతున్న ఈ రోజుల్లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం మాల్స్, మల్టిప్లెక్స్‌ల బంధం మరింత బలోపేతం కానుంది.

### ట్రాఫిక్–మౌలిక సదుపాయాల సవాలు

అయితే ఈ అభివృద్ధికి మరో వైపు సమస్యలూ ఉన్నాయి. మాల్స్ ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ తీవ్రమవుతోంది. ముఖ్యంగా వీకెండ్లలో కొన్ని ప్రధాన జంక్షన్ల వద్ద రోజుకు 6–8 గంటల వరకు ట్రాఫిక్ జామ్‌లు నమోదవుతున్నాయి. పార్కింగ్ కొరత, రహదారుల సామర్థ్యం సరిపోకపోవడం వల్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.







### దేశంలోనే తొలి ఏఐ ఆధారిత మల్టీప్లెక్స్...

ఓడియన్ మాల్ ప్రత్యేకత ఏమిటంటే... ఇది దేశంలోనే మొట్టమొదటి కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత మల్టీప్లెక్స్‌గా రూపుదిద్దుకుంది. టికెట్ బుకింగ్ నుంచి థియేటర్ ప్రవేశం వరకు, ఫుడ్ కోర్ట్ సేవల నుంచి సందర్శకుల మార్గదర్శకత్వం వరకు ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా టికెట్ చెకింగ్ చేయడం, సందర్శకులకు సహాయంగా రోబోటిక్ సేవలు అందించడం ఈ మాల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఆధునిక సదుపాయాల వల్ల సందర్శకులకు వేగవంతమైన, సురక్షితమైన సేవలు అందుబాటులోకి వచ్చాయి.

### సినీ అనుభూతికి అంతర్జాతీయ ప్రమాణాలు...

సినిమా అనుభూతిని కొత్త స్థాయికి తీసుకెళ్లేలా ఈ మల్టీప్లెక్స్‌ను రూపొందించారు. 4కే లేజర్ ప్రొజెక్షన్ స్క్రీన్లు, డాల్బీ అట్మోస్ సౌండ్ సిస్టంతో ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతినీ అందించనుంది. ప్రతి థియేటర్‌లో సీటింగ్ వ్యవస్థను అత్యంత సౌకర్యవంతంగా ఏర్పాటు చేశారు. స్క్రీన్ స్పష్టత, సౌండ్ క్లారిటీపై ప్రత్యేక దృష్టి సారించడంతో దేశీయ చిత్రాలతో పాటు అంతర్జాతీయ చిత్రాలను చూసి మరింత అనుభూతిని పొందే అవకాశాలు ఉన్నాయి.






# హైదరాబాద్‌లో ఏఐ మాల్

## ‘ఓడియన్ మాల్’ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

## నగర నడిబొడ్డున అధునాతన వినోద కేంద్రం



హార్ట్ ఆఫ్ ది హైదరాబాద్ అయినా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ లో మరో ఆధునిక వినోద–వాణిజ్య కేంద్రం అందుబాటులోకి వచ్చింది. చారిత్రాత్మక ఓడియన్ థియేటర్ స్థానంలో నిర్మించిన అత్యాధునిక ‘ఓడియన్ మాల్’ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీఫ్ గెస్ట్‌గా పాల్గొన్నారు. దశాబ్దాలుగా సినిమా అభిమానులకు కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు షాపింగ్, వినోదం, సాంకేతికత కలయికతో కొత్త రూపు దిద్దుకుంది. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నగర అభివృద్ధిలో భాగంగా పాత గుర్తింపులను కాపాడుకుంటూనే ఆధునిక అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**- విశాలాభారతి, హైదరాబాద్**

### ఫుడ్ కోర్ట్, గేమింగ్ జోన్ ప్రత్యేక ఆకర్షణ...

షాపింగ్, సినిమాల మధ్యలో విశ్రాంతి కోసం విశాలమైన ఫుడ్ కోర్టు ఏర్పాటు చేశారు. దేశీయ, అంతర్జాతీయ వంటకాలు అందించే అనేక ఫుడ్ స్టాల్స్ ఇక్కడ ఉన్నాయి. పరిశుభ్రత, రుచిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పిల్లలు, యువత కోసం ప్రత్యేకంగా గేమింగ్ జోన్ను రూపొందించారు. ఆధునిక గేమింగ్ పరికరాలు, వర్చువల్ రియాలిటీ గేమ్స్‌తో కుటుంబ వినోదానికి ఇది మరింత ఆకర్షణగా మారనుంది.

### ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా...

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో వాహనాల నిలుపుదల సమస్యను దృష్టిలో పెట్టుకుని భారీ మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయం కల్పించారు. ఒకేసారి వందలాది వాహనాలు నిలిపేలా ఈ పార్కింగ్ వ్యవస్థను రూపొందించారు. దీంతో రోడ్లపై వాహనాల నిలుపుదల తగ్గి ట్రాఫిక్ సమస్య కొంతవరకు పరిష్కారమవుతుందని అధికారులు భావిస్తున్నారు. నగర ప్రణాళికలో భాగంగా ఇలాంటి మౌలిక వసతులు కీలకమని వారు తెలిపారు.

### ఉపాధి అవకాశాలు...

ఓడియన్ మాల్ ప్రారంభంతో వందలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. షాపింగ్ మాల్స్, సినిమా హాల్స్, ఫుడ్ కోర్ట్, భద్రత, నిర్వహణ విభాగాల్లో ఉద్యోగాలు పెరుగుతాయి. నగర మధ్యలో ఉన్న ఈ మాల్ పర్యాటకులకు కూడా ఒక ప్రధాన ఆకర్షణగా మారనుంది. ముఖ్యంగా ఏఐ ఆధారిత సాంకేతికతను ప్రత్యక్షంగా అనుభవించాలనుకునే టెక్ ప్రియులకు ఇది ప్రత్యేక వేదికగా నిలుస్తుంది. గతంలో ఓడియన్ థియేటర్‌కు ఉన్న ప్రత్యేక గుర్తింపును కాపాడుతూ, నేటి కాలానికి తగిన సాంకేతికతను జోడించి ఈ మాల్‌ను నిర్మించడం విశేషమని అధికారులు తెలిపారు. నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే ప్రభుత్వ ప్రయత్నాల్లో భాగంగా ఇలాంటి ఆధునిక ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

### లులుమాల్ తరహాలో...

ఓడియన్ మాల్ కేవలం సినిమా థియేటర్లకే పరిమితం కాకుండా పూర్తిస్థాయి షాపింగ్–వినోద కేంద్రంగా రూపుదిద్దుకుంది. హైదరాబాద్‌లో ఇప్పటికే లులుమాల్‌కు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని, అదే తరహాలో ఇక్కడ కూడా జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్ల షోరూమ్‌లను ఏర్పాటు చేశారు. ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, ఎలక్ట్రానిక్స్ వంటి విభాగాల్లో విస్తృతమైన ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా మాల్‌ను డిజైన్ చేశారు. నగర నడిబొడ్డున ఉండటంతో యువత, కుటుంబాలు పెద్ద సంఖ్యలో సందర్శించే అవకాశముందని నిర్వాహకులు చెబుతున్నారు.

### నిర్మాణంలో శాంతశ్రీరామ్ ప్రత్యేక ముద్ర...

ఈ ప్రతిష్ఠాత్మక ఓడియన్ మాల్ ప్రాజెక్టును ప్రముఖ నిర్మాణ సంస్థ శాంతశ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ చేపట్టింది. లింగయ్య, నర్సయ్య మద్దె సారథ్యంలో సంస్థ ముందుకు సాగుతుంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న శాంతశ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ నిర్మాణ రంగంలో విశ్వసనీయతకు, నాణ్యతకు చిరునామాగా నిలిచింది. అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు, వాణిజ్య ప్రాజెక్ట్‌ల నిర్మాణంలో ఈ సంస్థకు విశాల అనుభవం ఉంది. అత్యున్నత నిర్మాణ ప్రమాణాలు, ఆధునిక డిజైన్, సమయపాలనతో ప్రాజెక్టుల పూర్తి చేయడమే సంస్థ ప్రత్యేకతగా నిలుస్తోంది. ఓడియన్ మాల్ నిర్మాణంలో కూడా పాత ఓడియన్ థియేటర్‌కు ఉన్న చారిత్రాత్మక గుర్తింపును కాపాడుతూ, నేటి అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతికతను వినియోగించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌లో వాణిజ్య–వినోద రంగ అభివృద్ధిలో శాంతశ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ మరో మైలురాయిని చేరిందని నిర్మాణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# రోజూ కొనసాగిస్తేనే..

బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె ఇటీవలే తన 40వ పుట్టినరోజు జరుపుకొన్నది. ఆ వయసులోనూ ఆ అందం, ఫిట్‌నెస్ చూసి.. దీపిక నలభై పడిలో పడిందంటే నమ్మడం కష్టమే. తన పుట్టినరోజు సందర్భంగా ఫిట్‌నెస్ సీక్రెట్స్‌ను అభిమానులతో పంచుకుంది ఈ బాలీవుడ్ బ్యూటీ. అత్యంత క్రమశిక్షణతో కూడిన వ్యాయామం, ఆహారపు అలవాట్లే తనను ఇప్పటికీ వెండితెరపై మెరిసేలా చేస్తున్నాయని చెప్పుకొచ్చింది. “నేను ఎప్పటినుంచో సమతుల ఆహారాన్ని అనుసరిస్తున్నాను. ఇది నాకు కేవలం డైట్ మాత్రమే కాదు, నా జీవనశైలి కూడా ప్రధాన కారణం” అని పేర్కొన్నది. సెలెబ్రిటీలు అసలు ఏమీ తినరని కేవలం సలాడ్ల మీదనే బతుకుతారనే అపోహపై ఆమె స్పందిస్తూ “నేను చాలా బాగా తింటాను” అంటూ తనకిష్టమైన స్వీట్లు, ఇతర పదార్థాల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసింది. మితంగా తినడంతోపాటు జీవితంలోని చిన్న చిన్న సంతోషాలను ఆస్వాదించడం తన ఫిట్‌నెస్ ఫార్ములా అంటున్నది దీపిక. “కేవలం జిమ్‌కు వెళ్లి వర్కవుట్లు చేసినంత మాత్రాన ఫిట్‌నెస్ రాదు. మానసిక ఆరోగ్యం కూడా చాలా అవసరం. మానసిక ఒత్తిడిని జయించడానికి యోగాసనాలు సాధన చేస్తాను” అని వెల్లడించింది. విపరీత కరణి అనే యోగాసనాన్ని అభిమానులతో షేర్ చేసుకుంది దీపిక.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.